హనీబీఏపి

సంపుటి 3, సంచిక 4

ఏప్రిల్ - జూన్ 2009

# పల్లెసృజన

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

## జమీలుల్లా వర్కింగ్ మాడల్స్ నైపుణ్యం



# 'హనీబీఏపి' ప్రగతి



'హనీబీఏపి' ఒక స్వచ్ఛంద సంస్థ, హనీబీ నెట్‌వర్క్‌ను ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతం చేయడమే దీని ఉద్దేశ్యం. ఎన్.ఐ.ఎఫ్. సంస్థకు, ఆధ్రప్రదేశ్‌లోని మారుమూల పల్లెల్లోని గ్రామీణ శాస్త్రవేత్త లతో సంధానం చేయడం ఈ సంస్థ మూల కార్యక్రమం.

నవంబర్ 2005 లో బ్రిగేడియర్ గణేశం, డా. కె.యల్. రావు, శ్రీ పి. చంద్రకాంత్ శర్మ గార్ల సంకల్పమే ఈ సంస్థకు జన్మనిచ్చింది. ప్రొఫెసర్ అనిల్ గుప్తా గారిని ఆదర్శంగా తీసుకుని వారి మహత్తర జ్ఞాన ఉద్యమాన్ని తెలుగునాట విస్తృతం చేసి, తెలుగు జాతి సృజనాత్మక శక్తిని దేశమంతా చాటి చెప్పాలనే ఆరాటంతో ప్రారంభమై 'ఇంతింతై వటుడింతై' అన్నట్లుగా పెరుగుతున్నది. స్వచ్ఛందంగా ఎంతో మంది చేతులు కలిపారు. పెద్దలు ఆశీర్వదించారు. అధికారులు చేయూత నిచ్చారు. అధికార, అనధికార సంస్థలు, వ్యక్తులు శాయశక్తులా తోడిచ్చారు. పత్రికలు, టీవీలు తగినంత కవరేజ్‌ని అందించాయి. అందరితోడు, శుభాకాంక్షలు ఈ స్వల్ప కాలంలో 'హనీబీ' పునాదులను పటిష్టం చేశాయి.

ఇంతవరకు హనీబీఏపి చేపట్టి సాధించిన వివిధ కార్యక్రమాలు :

☞ 74 మంది తెలుగు ఇన్నోవేటర్లను వెతికి, వెలుగులోకి తెచ్చి, వారి ఆవిష్కరణ లను, ఆలోచనలను ఎన్ఐఎఫ్‌లో రిజిష్టర్ లో చేయడం జరిగింది.

☞ నలుగురు ఇన్నోవేటర్ల ఆవిష్కరణలను పారిశ్రామిక వేత్తలకు అందించి, ఆర్థిక ఒప్పందం కుదుర్చడమైనది.

✤ ఒక ఆవిష్కరణ కార్యరూపం దాల్చుటకు, టెస్టింగ్‌కు టి.ఐ.పి.పి. ద్వారా నాలుగు లక్షల రూపాయల ఆర్థిక సహాయం.

✤ కారంచేడులో జరిగిన జాతీయ గ్రామీణ ప్రగతి ప్రదర్శనలో 28 మంది ఇన్నోవేటర్లు పాల్గొని విజయవంతం చేశారు.

✤ నిజామాబాద్ ప్రాంతంలో మినీ శోధయాత్ర నిర్వహించి, ఏడుమంది పల్లె ఇన్నోవేటర్లను వెలికి తీయడం జరిగింది.

✤ ఇప్పటి వరకు 10 కళాశాలల్లో స్టూడెంట్ ఇన్నోవేషన్ క్లబ్బులను ప్రారంభించడం జరిగింది..

✤ తెలుగు పల్లె జ్ఞానం దోమలను చంపే హెర్బల్ మందును ఎన్.ఐ.ఎఫ్. శాస్త్రీయంగా నిర్ధారించడం.

✤ హైదరాబాద్‌లో జనవరి 2008 ఉద్యాన వనశాఖ, వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహించిన ప్రదర్శనలో 8 మంది తెలుగు ఇన్నోవేటర్లు తమ ఇన్నోవేషన్లను ప్రదర్శించగా ఎంతోమంది వాటిని మెచ్చుకోవడం జరిగింది.

✤ జనవరి 2008లో విశాఖలో జరిగిన 95వ జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో ముగ్గురు ఇన్నోవేటర్లు పాల్గొని ప్రశంసలు పొందారు.

✤ ప్రప్రథమంగా ఆంధ్రప్రదేశ్‌లోని అరకు లోయలో శోధయాత్రను జనవరిలో నిర్వహించి, స్థానిక జ్ఞానాన్ని సేకరించడం జరిగింది.

✤ అలేరు నివాసి, ఉత్తమ ఇన్నోవేటర్ చింతకింది మల్లేశం అహమ్మదాబాద్‌లో జరిగిన జాతీయం ఇన్నోవేషన్ సమావేశానికి ఆహ్వానించబడ్డారు.

✤ నెల్లూరులో ఆదిశంకర విద్యా సంస్థలో 'జరిగిన టెక్నాలజీ మేళా'లో 19 మంది ఇన్నోటర్లు పాల్గొనటం జరిగింది.

✤ 'పల్లెసృజన' త్రైమాసిక పత్రికను విజయవంతంగా ప్రచురిస్తూ మూడవ సంవత్సరంలోకి అడుగు పెట్టడం.

✤ 'టెప్' విజ్ఞాన సాంకేతిక విభాగం కేంద్ర ప్రభుత్వం ద్వారా 8 ఇన్నోవేటర్లకు ఆర్థిక సహాయానికి తోడ్పడటం.

✤ ఎన్.ఐ.టి. వరంగల్‌లో నలుగురు ఇన్నోవేటర్లు 'ఇన్నోవేటర్ల సమావేశం'లో పాల్గొనటం.

✤ వెయ్యికి పైగా సాంప్రదాయ జ్ఞానాన్ని సేకరించి ఎన్.ఐ.ఎఫ్.కు పంపడం.

✤ దాదాపు తొమ్మిది మంది ఇన్నోవేటర్లకు తమ ఆలోచనలను కార్యరూపం చేయటానికి కావలసిన ఆర్థిక సహాయాన్ని అందించటం.

✤ ఇన్నోవేటర్లకు జాతీయ వ్యవసాయ పరిశోధన, సాంకేతిక విజ్ఞాన మేనేజ్ మెంట్ (నారమ్) లో వివిధ 'సెమినార్ల'లో శిక్షణా కార్యక్రమాల్లో అతిథిగా పాల్గొనేట్లు చేయటం.

✤ 16 మంది 'బిట్స్ పిలాని' విద్యార్థులతో వరంగల్ జిల్లా ఏటూరునాగారం, తొర్రూరు మండలాల్లోని పది గ్రామాల్లో 'జ్ఞానశోధ' చేయడం.

✤ జాతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ (నారమ్) నుండి 16 మంది పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లమా విద్యార్థులు నల్లమల అడవుల్లో నాలుగు చెంచుల గ్రామాలను సెప్టెంబర్ 2009లో జ్ఞాన సేకరణ చేయడం.

✤ చింతకింది మల్లేశం ఆసు మిషన్ ప్రొవిజనల్ పేటెంట్ పొందడం.

✤ నరసింహాచారి, ఇష్వాక్, లింగ బ్రహ్మంల పేటెంట్ కేసులను ఫైలు చేయడం.

**మా కలలు :**

✤ ఏడవ ద్వైవార్షిక పోటీలకు వేయి ఎంట్రీలను ఆంధ్రప్రదేశ్ నుండి పంపడం.

✤ కనీసం నలుగురు తెలుగు గ్రామీణ ఆవిష్కర్తలకు రాష్ట్రపతి చేతులమీదుగా బహుమతి ఇప్పించడం.

✤ పల్లెజ్ఞానవేత్తల ఇన్నోవేషన్లను మార్కెట్‌లోకి తేవడం

మా కలలు నిజం కావాలంటే మీ సహకారం కావాలి. ప్రోత్సహించండి – పాల్గొనండి – ఆవిష్కరించండి.

**– బ్రిగేడియర్ పి. గణేశం,**
కో–ఆర్డినేటర్, హనీబీఏపి,
ఫోన్ : 98660 01678.

# పల్లెసృజన

సంపుటి-3 సంచిక - 4 ఏప్రిల్ - జూన్ 2009

**సంపాదకవర్గం**

సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సలహాదారులు :
**డా. కె.ఎల్. రావు**
**ప్రొ. అనిల్ గుప్త**
**డా. గీర్వాణి**
**శ్రీ పి. చంద్రకాంత్ శర్మ**
**డా. వై.వి. రావ్**
**శ్రీమతి అరుణ గణేశం**
**పల్లె వీర రాఘవ రెడ్డి**

డి.టి.పి. & డిజైనింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్, హైదరాబాద్.**
ఫోన్ : 040- 42215350
సెల్ : 93913 75655, 92468 20655
E-mail : narendragrafix@gmail.com

ఎడిటోరియల్ అడ్రస్ :
పల్లెసృజన
102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27118555
E-mail : honeybeeap@gmail.com

## ఈ సంచికలో...

✤ ప్రతిభకు గుర్తింపు అవసరం! - 3
✤ పోస్టు కార్డులపైన ఆరోగ్యం - 5
✤ చంపారన్ లో 22వ శోధయాత్ర - 9
✤ మట్టిమేట వేయని ఆనకట్ట వినూత్న నమూనా ! - 16
✤ జాగో మనిషీ ! - 17
✤ ప్రతిభ గుర్తింపుకు సరియైన పరిసరాలు అవసరమా? - 19
✤ చిన్నారుల సహజ క్రియాశీలత -
✤ ఉజ్వల భవిష్యత్తుకు బీజం - 20
✤ శతాధిక వృద్ధురాలు పూరిబెన్ - 22
✤ గ్రామ జ్ఞానంతో విద్యార్థుల అనుబంధం : జ్ఞానశోధ - 23
✤ స్పందన - 27

**కవర్ లోపలి పేజీల్లో :**

**హనీబీఎపి ప్రగతి**

**7వ ద్వైవార్షిక పోటీ**

## HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee C/o Prof. Anil Gupta**
Indian Institute of Management
Vastrapur, Ahmedabad - 380 015.
Gujarat, India. Ph.: 91-79-26324927, Fax : 91-79-26307341
E-mail : honeybee@sristi.org. http://www.sristi.org

**Aama Akha Pakha (Oriya)**
**Dr. Balaram Sahu,**
3R BP 5/2, BP Colony, Unit-8,
Bhubaneswar-751 012.Orissa.
E-mail : balaram_sahu@hotmail.com

**Hittalagida (Kannada)**
**Dr. T.N. Prakash**
Department of Agricultural Economics,
University of Agricultural Economics,
GKVK, Bangalore-560 065.
E-mail : prakashtnk@yahoo.com

**Num Vali Velanmai (Tamil)**
**P. Vivekanandan,**
45, TPM Nagar,
Virattipathu - 625 010. Tamilnadu
E-mail : numvali@vsnl.com

**Loksarvani (Gujarati) and**
**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P.O. Box No. 1550.
Ambawadi, Ahmedabad - 380 015.
E-mail : loksarvani@sristi.org
sujhbujh@sristi.org

**Ini Karshakan Samsarikkatte**
**(Malayalam)**
**James T J,**
Peemade Development Society,
Peermade, Idukki-685 531, Kerala.
E-mail : pedes@md2.vsnl.net.in

Printed & Published by : Brig. P. Ganesham, VSM (Poorva Senani), on behalf of "HoneyBeeAP"
102, Vayupuri, Sainikpuri Post, Secunderabad - 500 094. A.P.
Ph.: 040-27118555, Cell : 0 98660 01678. Printed at : Narendra Grafix, Chikkadpally, Hyderabad. Ph. : 93913 75655

# సంపాదకీయం

గ్రామాల్లో ప్రజలు ప్రకృతితో అతి సామరస్యంగా ఉంటారు. కూరలకై చెట్టు ఆకులను చెట్టు పెరుగుదలకు నష్టం కాకుండా తెంపుతారు. పొలానికి నీళ్ళు పొదుపుగా వాడతారు. పశువుల గ్రాసానికి గడ్డి పెంచుతారు. పశువుల పేడ మూత్రంతో తడిసిన గడ్డిని కంపోస్టుగా చేస్తారు. రీసైక్లింగ్ వారి జీవన చక్రంలో వుంది. వనరులన్నీ వాడుతూ వాటిని సంరక్షణ చేస్తూ అనంతంగా వాడడానికి కొన్ని పద్ధతులను అవలంభిస్తారు.

దుబ్బతాండ, తొర్రూరు మండలంలో 'సోము' తెల్లగా, ఎత్తుగా, ఠీవిగా ఉండే ఆదివాసి. వయస్సు తొంభై పైనే. నాల్గో తరగతి చదివిన ప్రథమ ఆదివాసి. ఆయన చిన్న తనంలో ఆ ప్రాంతంలోని ఆదివాసులకు ఆదర్శమై ప్రభుత్వంతో పోరాడి అందరికీ పట్టాలనిప్పించారు. దుబ్బతాండ చుట్టూ అడవులు ఉండేవి. అవన్నీ ఇప్పుడు దూరంగా వెళ్ళిపోయాయి. ఎందుకని అడిగితే సోము 'జంగ్లాత్ వాలే కాట్ దియే' అన్నాడు. ఆదివాసులు ఆ అడవి కొట్టలేదు. అటవీ శాఖ వారి అనుమతితో పట్టణ వాసులు, డెవలప్‌మెంట్ పేరుమీద చెట్లు కొట్టి ఆదివాసులకు అడవి లేకుండా శాశ్వత నష్టం చేశారని చెప్పారు. ఈ నష్టాన్ని పూడ్చేదెవరు?

జాతీయ ఉపాధి హామీ పథకం ఒక వరంగా ప్రభుత్వం భావిస్తోంది. అందులో ఏమాత్రం సందేహం లేదు. గ్రామాల్లో ఒక వర్గానికి నిజంగా అది వరమే. వారి కుటుంబాలు కడుపు నిండా సంవత్సరమంతా తినగలిగే అవకాశం ఉందా? దీనికి మద్దతుగా ఒక కిలో బియ్యం రూ. 2/-ల చొప్పున లభించడంతో భోజన సమస్య బడుగు వర్గాలకు కొంత మేలైందనే చెప్పొచ్చు. అయితే గ్రామంలోని మిగతా వర్గాలపై ఈ పథకం ఎలాంటి ప్రభావాన్ని చూపెడుతుందన్న విషయాన్ని మనం చర్చించవలసి వున్నది.

గ్రామాల్లో ప్రజల జీవితాలు ఒకరికొకరితో ముడిపడి ఉంటాయి. ఒక వర్గానికి వారి జీవితంలో తీవ్రమైన మార్పులు వస్తే వాటి ప్రభావం మిగతా గ్రామవాసులపై తప్పకుండా ఉంటుంది అది ఎలా ఉంటుందన్నది గమనించి, ఈ పథకాలు గ్రామ జీవన వ్యవస్థను అతలాకుతలం చేయకుండా చూడాలి.. శ్రమ ఆధారంగా ఉపాధిని కల్పిస్తున్న ప్రభుత్వ పథకం గ్రామాల్లో ప్రత్యేకమైన నైపుణ్యాలకు ప్రోద్బలం ఇవ్వడంలేదు. ఇవి కాలక్రమంగానశించిపోవడానికి ఆస్కారం ఉంది. వ్యవసాయానికి కావాల్సిన కూలీలు కూడా ఈ పథకం వల్ల సరిగ్గా లభించటం లేదన్న విషయాన్ని కూడా మనం తీవ్రంగా ఆలోచించాల్సిన అవసరం ఉన్నది.

సమస్యల నుండి గ్రామాన్ని కాపాడటం మన సమాజ బాధ్యత. భావి తరానికి ఆహార రక్షణ కల్పించాలంటే గ్రామాల్లోని వ్యవసాయ అనుకూల పథకాలు రూపొందించాలి. ప్రకృతి పరిరక్షణ, పశు పక్ష్యాదుల సంరక్షణ, భూమి సార రక్షణ, నీటి పారుదల పథకాలు, ప్రజల నైపుణ్యాలు, వృత్తి పనులు ఇవన్నిటిని ఏకంగా, నిశితంగా పరిశీలించినపుడే ఏ పథకమైనా విజయవంతం అవుతుందని ఆశించవచ్చు.


ఈ విషయాలపై హానీబిఏపికి గ్రామవాసులు ఎన్నో రకాల అభిప్రాయాలను 'జ్ఞానశోధ' యాత్రలో వెలిబుచ్చారు. పాఠకుల అభిప్రాయాలను, ఈ విషయాలపై 'పల్లెసృజన' ఒక ప్రజా వేదికగా ప్రచురించాలని నిర్ణయించి మీ ఉత్తరాలకై ఎదురు చూస్తూ... నమస్సులతో.....

భవదీయ


'బ్రిగేడియర్' గణేశం

# ప్రతిభకు గుర్తింపు అవసరం!


## అద్భుత వర్కింగ్ మాడల్ సృష్టికర్త కందుగుల గ్రామవాసి - జమీలుల్లా




కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం కందుగుల గ్రామానికి చెందిన జమీలుల్లా (38) చదివింది కేవలం 10వ తరగతి. కానీ, అద్భుతమైన పనితనాన్ని తన సొంతం చేసుకున్నాడు. 2000 సంవత్సరంలో చెక్క పెట్టెలతో ఒక పెద్ద భవంతి నమూనాను తయారు చేసి తన ప్రత్యేకతను చాటుకున్నాడు. ఆర్థిక పరిస్థితుల రీత్యా స్కూలు విద్యకు మించి చదవలేక పోయాడు. జీవనాధారం కోసం సమీప రైల్వే స్టేషన్ వద్ద ఓ బడ్డీ కొట్టు నడుపుకుంటున్నాడు. రైలు స్టేషన్ సమీపంలోనే తన సమయం అంతా గడపటంతో వచ్చే పోయే రైళ్ళను చూస్తూ తాను కూడా రైలింజన్ 'మీనియేచర్' (నమూనా రైలింజన్) తయారు చేస్తే బాగుంటుందని ఆలోచించిందే తడవు తన పని ప్రారంభించాడు. 12 వేల రూపాయల ఖర్చుతో విద్యుత్‌తో నడిచే బుల్లి రైలింజన్‌ను తయారు చేశాడు.




ఈ విషయం తెలుసుకున్న కాజీపేట రైల్వేశాఖ అధికారులు ఆ బుల్లి రైలింజన్ లాగే 12 చక్రాలతో రైలింజన్‌ను తయారు చేయాలని జమీలుల్లాను కోరారు. రైల్వేశాఖ ఆదేశాల మేరకు జమీలుల్లా దాదాపు 40 వేల రూపాయలు వెచ్చించి 12 చక్రాలతో నడిచే బుల్లి రైలింజన్‌ను తయారు చేసి కాజీపేట రైల్వే స్టేషన్‌లో ట్రయల్ రన్ చేసి చూపించాడు. తన ప్రతిభను మెచ్చుకున్న అధికారులు సికింద్రాబాద్ రైల్వే ఇంచార్జి వి.ఆర్. గుప్తాకు ముందుగా ఈ రైలింజన్‌ను చూపించి, సికింద్రాబాద్‌లో మరోసారి ట్రయల్ రన్ చేయించారు. ఈ విషయాన్ని వి.ఆర్. గుప్తా ఢిల్లీ



రైల్వే మ్యూజియం అధికారులకు సమాచారం అందించడంతో 2006వ సంవత్సరంలో జమీలుల్లాను ఢిల్లీకి ఆహ్వానించారు.

అధికారుల ఆహ్వానం మేరకు తన స్వంత ఖర్చులతో ఢిల్లీకి వెళ్ళిన జమీలుల్లాకు అప్పటి మ్యూజియం అధికారి సందీప్ మోహర 8 అడుగుల పొడవు, 20 ఇంచుల వెడల్పు, మూడు అడుగుల ఎత్తుతో నాలుగు నెలల్లో మరో రైలింజన్‌ను తయారు చేయాలని కోరగా రెండు లక్షల రూపాయల వ్యయంతో అధికారులు సూచించిన కొలతల ప్రకారం తయారు చేశాడు. దీంతో గల్లి నుండి ఢిల్లీ వరకు రైల్వే అధికారులు తెసుకెళ్ళి ప్రశంసా పత్రాలను అందజేశారే తప్ప వాటి తయారీకి పెట్టిన పెట్టుబడితో అప్పుల్లో కూరుకుపోయిన జమీలుల్లాకు రైల్వేశాఖ అధికారులు ఏ దారీ చూపలేక పోయారు. 2003వ సంవత్సరం ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి పాదయాత్రలో భాగంగా కందుగుల గ్రామాన్ని సందర్శించిన ఆయన దృష్టికి తీసుకెళితే తాను ప్రతిపక్షంలో ఉన్నానని, అధికారంలోకి వచ్చాక నీకు ఆదరణ కల్పిస్తానని హామీ ఇచ్చినట్లు జమీలుల్లా తెలిపాడు. ఇటు ప్రభుత్వాలు, అటు రైల్వే అధికారులు ఆదరించకపోవడంతో ఉన్న రెండు ఎకరాల భూమిని అమ్ముకున్నప్పటికి అప్పులు తీరకపోవడంతో దినసరి కూలీగా పనిచేస్తూ వృద్ధ తల్లిదండ్రులను పోషిస్తూ భారంగా జీవనం వెల్లదీస్తున్నాడు.

ఈ విషయం తెలిసిన హనీబీఏపి జమీలుల్లాకు సరియైన ప్రోత్సాహం అందించ డానికి పూనుకుంది. మన రాష్ట్రంలోనున్న అన్ని రకాల వర్కింగ్ మాడల్స్ చేయగల జమీలుల్లా ప్రతిభను ప్రభుత్వం, పరిశ్రమలు, కళాశాలలు, పాఠశాలలు, పరిశోధనా సంస్థలు అందరూ వాడాలి. ఆంధ్రప్రదేశ్‌లో ఇంతటి ప్రతిభ కలవారు ఒకరో ఇద్దరో ఉండవచ్చు. మనమంతా కలిసి 'మనవాడికి' ప్రోత్సాహమిద్దాం. ప్రతిభకు గౌరవమిద్దాం. ఆయన జీవితంలోకి వెలుగును తీసుకు వద్దాం.

వివరాలకు ఎడిటర్‌ను సంప్రదించండి.

●

## ఫోన్ చేయండి!

## 'పల్లెసృజన'లో

ప్రచురించిన వ్యాసాలను గూర్చి ఏవైనా వివరాలు కావలసిన వారు, గ్రామీణ ఇన్నోవేషన్లకు సంబంధించిన ఇతర సమాచారం కోసం ఈ క్రింది చిరునామాకు ఉత్తరం వ్రాసి కాని, లేదా క్రింద తెలిపిన నెంబర్లకు ఫోన్ చేసి కాని తెలుసుకోవచ్చు. లేదా ఈ-మెయిల్ ద్వారా కూడా మీకు కావలసిన సమాచారాన్ని పొందవచ్చు.

– ఎడిటర్.

**బ్రిగేడియర్ పి. గణేశం**
**ఎడిటర్‌పల్లెసృజన**
**102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,**
**సికింద్రాబాద్ - 500 094.**
**ఫోన్ : 040-27118555**
**సెల్ : 98660 01678**
E-mail : honeybeeap@gmail.com

## గ్రామీణ సృజనాత్మక శక్తి వేదిక 'పల్లెసృజన'

పల్లెసృజన ఒక వేదికగా ఉపయోగపడాలంటే మీరు మీ సమస్యలను, ఆలోచనలను, జ్ఞాన సంపదను సంకోచించకుండా పంపండి. ఎంత చిన్న ఆలోచన అయినా సరే మేము ఆహ్వానిస్తాం. ప్రతి సంచికలో ఉత్తమ ఎంట్రీకి ఉచిత వార్షిక సభ్యత్వం ఇవ్వబడుతుంది. మీ సమస్యలను "పల్లెసృజన"లో ప్రచురిస్తాం. వాటి సమాధానాలు పాఠకులు పంపితే వాటిని కూడా ప్రచురిస్తాం. మీరంతా సహకరించి ఈ గ్రామీణ సృజనాశక్తి వెలుగుదారుల వేదికను సద్వినియోగం చేసుకుంటారని ఆశిస్తున్నాం.

-సంపాదకవర్గం

# పోస్టు కార్డులపైన ఆరోగ్యం



పోస్టు కార్డులపైన ఆరోగ్యం.... అంటేనే ఎవరికైనా ఒకింత ఆశ్చర్యంగా ఉంటుంది. అవును. ఇది ముమ్మాటికీ నిజం. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా ఇరవై రెండువేల ఎనిమిది వందల ముప్పయి తొమ్మిది (22,839) పోస్టు కార్డుల ద్వారా ఆరోగ్య సందేశాలు. అక్టోబర్ 13, 2009 నాటికి అన్నీ చేతితో రాసినవే. అన్నీ పంపింది ఒకరే. అతనే డాక్టర్ ఆరవీటి రామయోగయ్య, రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ హెల్త్, ఆంధ్రప్రదేశ్.

ఒకసారి రామయోగయ్య గారి నేపథ్యంలోకి వెళితే.... పుట్టింది, పెరిగింది పల్లెసీమల్లో, గ్రామీణ వ్యవసాయ కుటుంబం. బాల్యమంతా ఇంటిపని, పొలంపనితో కలిసిన చదువుతో గడిచింది. కల్లాకపటం ఎరుగని అమ్మా, నాన్నలు. ఉమ్మడి కుటుంబ జీవితం. లంకంత ఇల్లు, ఇంటినిండా మనుషులు. పూజలు, వ్రతాలు, ఆట్టే ఆచరించని కుటుంబం. కులాల గురించి, మతాల గురించి రాజకీయాల గురించి ఏమీ మాట్లాడుకోని కుటుంబం. కులాలకు అతీతంగా వరుసలు కలుపుకొని పిలుచుకునే గ్రామీణ నేపథ్యం. నాన్నను అన్నా అని పిలిచే ఆడవాళ్ళంతా రామయోగయ్యకు అత్తలే.


8వ తరగతి వరకు పుట్టిన గ్రామంలోనే తెలుగుమీడియం చదువు. 9 నుండి 12 వరకు 6 కిలోమీటర్ల దూరంలో ఉండే పట్టణంలో చదువు. నాలుగు సంవత్సారాల పట్టణ పాఠశాల చదువులో వాగులు, వంకలు, ఎండలూ, వానల్లో నడక మరియు సైకిలు ప్రయాణము. స్కూలులో ఎప్పుడూ ఫస్టే. పాఠశాల దశలోనే హిందీలో 'విశారద' పూర్తి చేశారు. 11వ తరగతిలోనే ఢిల్లీలోని యునైటెడ్ స్కూల్స్ ఆర్గనైజేషన్ దేశవ్యాప్తంగా నిర్వహించే జనరల్ నాలెడ్జి పరీక్షలో జాతీయ స్థాయిలో రెండవ స్థానం, 12వ తరగతిలో రాష్ట్రంలో 5వ ర్యాంకు.

కుటుంబ నేపథ్యంలో పెద్ద చదువులు చదివే అవకాశం లేనందువల్ల హిందీ టీచరుగానీ, పోస్టల్ క్లర్క్ కావాలని అనుకున్నాడు. రవ్వంత సహకారం లభిస్తే యూనివర్సిటీ స్థాయిలో లెక్కల టీచరు కావాలనుకున్నాడు. వీలైతే సివిల్స్ రాయాలనుకున్నాడు.

వచ్చిన మార్కులకు ఎందులోనైనా సీటు వస్తుంది. హైస్కూలు హెడ్మాస్టరుగా పనిచేసే చిన్నాయన అప్పటికప్పుడు అడగకున్నా స్పందించాడు. యం.బి.బి.యస్. లో చేర్పించాడు. పిల్లల వైద్యంలో సెషలిస్టు చదువు. అయితే వైద్య కళాశాలలో సగటు విద్యార్థి మాత్రమే. టీచరు కావాలనుకుని, డాక్టరు అయ్యాడు.

పుట్టిన గ్రామంలో స్వంత పొలంలో కొట్టం వేసి, రాతి బెంచీలతో స్వంత ప్రాక్టీసు పెట్టాలనుకున్నాడు. సర్వీసు కమీషను ద్వారా ప్రభుత్వోద్యోగానికి సెలక్షన్. కేవలం ఆరు నెలలు పట్టణంలో ప్రాక్టీసు. "డాక్టరుగారు ఫీజెంత? అంటే, మీ ఇష్టం" – ఇదీ వరస. డాక్టరుకు రేటా! అనే అంతర్మథనం. "డాక్టరును ప్రజలు కాపాడుకోవాలి. డాక్టరు ప్రజలను కాపాడాలి' ఇదీ రామ యోగయ్య వేదాంతం.

ఉద్యోగంలో 20 సంవత్సరాలు గ్రామాలు, చిన్న పట్టణాల్లోనే. పనిచేసిన చోటల్లా ఒక కొత్త నిర్మాణాత్మక ఒరవడిలో



పనిచేయటం. ఏ గ్రామానికి క్యాంపు పోయినా గ్రామంలోనే గ్రామ ప్రజలు పెట్టిన భోజనం. 20 సంవత్సరాల తర్వాత పనిచేసిన పాత ఊర్లకు పోతే ఆయన గుర్తు పట్టలేని వారు గుర్తుపట్టి పలకరింపులు. వారు పొందిన సేవల గురించి గుర్తు చేయడం, ఆ కళ్ళలో తృప్తి, ఆరాధనా భావం గొప్ప అనుభూతి అంటారు డాక్టరుగారు. బస్సులు డాక్టరు కోసం ఆగడం, డాక్టరుకు బస్సులో మొదటి సీటు ఇవ్వడం, సీటులో ఉన్నవారు లేచి సీటు ఇవ్వడం గ్రామీణుల ప్రేమాభిమానాలకు నిదర్శనం.

ఉద్యోగం మొదటి రోజుల్లోనే గ్రహించింది. "చాలా జబ్బులు వాతంతట అవే తగ్గిపోతాయని, చాలా జబ్బులు నిరోధించుకోవచ్చని, కేవలం కొన్ని సమయాల్లో మాత్రమే వైద్యం అవసరం" అనే సత్యం. అదే సత్యానికి కట్టుబడి, ఆ దిశలోనే 30 సంవత్సరాలు అధ్యయనం చేసి అమలు చేశారు.

ఆరోగ్యాన్ని గురించి పత్రికలకు వందల వ్యాసాలు వ్రాశారు. ప్రజలతో మాట్లాడారు. రోగులతో మాట్లాడారు. ఉపాధ్యాయులకు చెప్పారు. విద్యార్థులకు చెప్పారు, పండితులకు చెప్పారు, పామరులకు చెప్పారు. 1989లో ప్రపంచ ఆరోగ్య సంస్థ 'మనం ఆరోగ్యాన్ని గురించి మాట్లాడుదాం' అనే సందేశమిచ్చింది. అది ఆయనకు గొప్ప స్ఫూర్తి.


ప్రపంచవ్యాప్తంగా 1993లో శిశు మైత్రీ ఆసుపత్రుల ఉద్యమం వచ్చింది. చిత్తూరు జిల్లా కేంద్ర ఆసుపత్రికి దేశంలోనే మొదటి ప్రభుత్వ శిశుమైత్రి ఆసుపత్రిగా, రాష్ట్రంలో మొదటి శిశుమైత్రి ఆసుపత్రిగా గుర్తింపు. ఇందుకు డాక్టర్ రామయోగయ్య చేసిన కృషే ప్రధానం. అందుకే ఆయనకు ఆనాటి ముఖ్యమంత్రి గౌ. శ్రీ కోట్ల విజయభాస్కర రెడ్డి చేతులమీదుగా పురస్కారం లభించింది. ఆసుపత్రుల ద్వారా తల్లిపాల సంస్కృతి పునరుద్ధరణ ఈ ఉద్యమ ప్రధాన లక్ష్యం.




ఇక 'పోస్టు కార్డులపై ఆరోగ్యం' ప్రస్థానం గురించి – ప్రపంచ వ్యాప్తంగా శిశుమైత్రి ఆసుపత్రుల ఉద్యమంలో భాగంగా చిత్తూరు జిల్లా ఆసుపత్రిలో తల్లులకు తల్లిపాల సంస్కృతి గురించి అవగాహన కలిగించేవారు. ఆ ఆసుపత్రిలో ఏటా దాదాపు 2,500 కాన్పులు జరిగేవి. వారందరికీ తల్లిపాల గురించి అవగాహన కలిగించేవారు. వారు ఇంటికి పోయిన తర్వాత ఆ స్ఫూర్తిని కొనసాగించటానికి డాక్టరు రామయోగయ్యకు తట్టిన ఏకైక ఆలోచన ఉత్తరం రాయడం. దాదాపు 1440 మందికి ఉత్తరాలు రాశారు. పోస్టు కార్డుపై చేతితో రాసిన ఉత్తరాలు అవి. చాలామంది గ్రామీణ తల్లులు, వారిపేరుతో జీవితంలో ఎప్పుడు కూడా ఒక ఉత్తరానికి నోచుకోనివారు. వారి గురించి, వారి చిన్నారుల గురించి ఆలోచించే వారి డాక్టరు నుండి ఆప్యాయతతో ఉత్తరం ద్వారా పలకరింపు వారికి గొప్ప అనుభూతి. మళ్ళీ డాక్టరును కలిసినపుడు డాక్టరుతో ఉత్తరము గురించి మాట్లాడారు. చదువురాని తల్లులు ఇతరులతో చదివించుకున్నారు. కుటుంబ సభ్యులు, ఇరుగు పొరుగువారు ఉత్తరం గురించి మాట్లాడుకున్నారు. ఏమిటీ ఈమెకు ఉత్తరం వచ్చింది అని పోస్టల్ ఉద్యోగులు ఆసక్తిగా చదివారు. ఉత్తరంలోని అంశాలు బహిరంగ సమాచారమైంది. వెరసి ఉత్తరాన్ని ఆత్మీయంగా జీవన పుటల్లో దాచుకున్నారు. ఉత్తరాన్ని తల్లులకు పంపిస్తే మరింత మందిని చేరింది. ఈ ఫలితం ఆరోగ్య సందేశాలకు గొప్ప మైలురాయి.

మనదేశంలో 1995లో పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభించారు. ప్రతి సంవత్సరం డాక్టరు గారు ఏదో ఒక స్థాయిలో పాల్గొనేవారు. 2004లో గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిగా జిల్లా స్థాయిలో పల్స్ పోలియో కార్యక్రమం ఆయన సారథ్యంలో జరిగింది. 2004 చివర్లో వ్యక్తిగత కారణాలపై 2 నెలలు సెలవు పెట్టారు రామయోగయ్య. పల్స్ పోలియో కార్యక్రమంలో తల్లుల మనసు దోచుకున్న ఉత్తరం గుర్తొచ్చింది. అభిమానుల సహాయంతో పల్స్ పోలియో ఆవశ్యకత గురించి, కార్యక్రమ విజయం చేయాల్సిన ఆవశ్యకత గురించి 3000 పోస్టు కార్డులు రాయించారు. రెండు దఫాలుగా గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి, మిత్రులకు, బంధువులకు సహచరులకు పంపారు.

రక్షిత మంచినీరు, సరైన పారిశుధ్య వసతులు లేనందువల్ల వచ్చే జబ్బులతో జనం పిట్టల్లా రాలిపోతున్నారనేది రామయోగయ్యను కలచివేసింది. ఈ దిశలో ఏదో చేయాలనే తపన. వ్యవస్థాపరంగా పెద్దగా ముందుకు పోలేక పోతున్నామనే వ్యధ. ఎన్నో సమావేశాల్లో స్వీయ సంరక్షణ గురించి చెప్పారు. వృత్తిలో భాగంగా చేయవలసిన ప్రయత్నమంతా చేశారు. స్వయంగా గుంటూరు జిల్లాలో సిబ్బందితో 50 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు వెళ్ళారు. రక్షిత మంచినీరు, పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత గురించి పాఠశాలల అసెంబ్లీలలో విద్యార్థులకు బోధించారు. 2005 జూన్‌లో రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కోరి హైదరాబాద్‌లోని ఆ శాఖ కేంద్ర కార్యాలయానికి జాయింట్ డైరెక్టర్‌గా బదిలీ చేయించుకుంది. అక్కడ మహిళలు - చిన్న పిల్లల ఆరోగ్యాన్ని గురించి ప్రణాళికలు రూపొందించింది. అమలు చేసే ఉద్యోగం. ఆలోచన అంతా మంచినీరు, పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత గురించి ప్రజల దగ్గరికి చేరుకొనేది. మళ్ళీ ఉత్తరం గుర్తొచ్చింది. మాజీ స్వయ రక్షణ చర్యలు పాటిస్తే 13 వ్యాధుల నుండి రక్షణ. సందేశాన్ని తయారు చేశారు. పోస్టుకార్డుపైకి ఎక్కించారు. "ఆరోగ్యం కోసం మార్పు" అనే పేరు పెట్టారు. కాచి చల్లార్చిన నీరు తాగడం, ఆహారం తినేముందు, మల విసర్జన తర్వాత చేతులు సబ్బునీరుతో కడుక్కోవడం, దోమతెరలు వాడటం ద్వారా నీళ్ళ విరేచనాలు, చీము రక్త విరేచనాలు, కలరా, అమీబియాసిస్, టైఫాయిడ్ జ్వరం, పచ్చ కామెర్లు, నులి పురుగుల వ్యాధి, పోలియో, మలేరియా, మెదడు వాపు, డెంగీ జ్వరం, చికున్ గున్యా, బోధ వ్యాధులను నిరోధించవచ్చు అనేది ఈ ఉత్తరం సారాంశం క్లుప్తంగా. రోజూ కనీసం 10 పోస్టు కార్డులు గ్రామీణ ప్రాంతాలకు పంపి కానీ నిద్రపోకూడదని నిర్ణయించుకున్నారు డాక్టరు గారు. జాయింట్ డైరెక్టర్‌గా పని ఒత్తిడితో అసలు మొదలే పెట్టలేక పోయాడు. అక్టోబర్ 2006లో మరల బదిలీ అప్పుడు కొంత వెసులుబాటు. 24-10-2006న 4 కార్డులు రాసి పంపాడు. 13-10-2009 నాటికి 14,462 మంది వ్యక్తులకు, సంస్థలకు "ఆరోగ్యం కోసం మార్పు" ఉత్తరాలు పంపారు. ఈ ఉత్తరాలు పంపడం ఒక నిరంతర కార్యక్రమం. ప్రధాన లక్ష్యం సమాజంలో ఆరోగ్యాన్ని గురించి ఒక చర్చ జరగాలని. పంపిన కార్డులలో 90 శాతం గ్రామీణ ప్రాంతాలకు పోయినవి. రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, అనంతపురం, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, కర్నూలు జిల్లాలోని అన్ని గ్రామీణ ప్రాంతాలకు పోయినవి. అన్ని గ్రామీణ ప్రభుత్వ పాఠశాలలకు, అదిలాబాద్ మరియు కృష్ణా జిల్లాల్లోని కొన్ని ప్రభుత్వ పాఠశాలలకు, పోస్టు కార్డులు వెళ్ళాయి. పెద్ద చర్చే జరిగింది. దీనిపై కార్యక్రమం మొదలు పెట్టిన ఒక డాక్టరు మిత్రుడు "నీకు 20 మందికంటే ఎక్కువ తెలిసిన వారుండరు కదా! ఎక్కువ మందికి ఎలా పంపగలవు?" అన్నాడు. ఆయన ఈ కార్డులోని అంశాలకు ఇంకా 260 అంశాలు చేర్చి, 15 వ్యాధులు నిరోధించే స్క్రిప్ట్ తయారు చేసి, స్టిక్కర్సు తయారు చేసి పది, పదిహేను గృహాలకు అంటించారు. కొందరు పోస్టు కార్డులపై ప్రింటు చేస్తే సులభమన్నారు. మరికొందరు జిరాక్స్ చేయించమన్నారు. అలాంటి కార్యక్రమాలు ఇప్పటికే జరిగినట్లు రామయోగయ్యకు కూడా తెలును. ఉత్తరంలోని సందేశంలో ఆత్మ ఉండాలనేది ఆయన ఆకాంక్ష. అప్పుడే కార్యక్రమం విజయవంతుందని. అందుకే చేతితో రాశాడు. అందువల్లే చర్చ జరిగింది. కొందరు కరపత్రం వేస్తామన్నారు. సున్నితంగా వద్దన్నారు. ప్రొద్దుటూరులో ఒక చిన్న పిల్లల డాక్టరు ఆసుపత్రి ముందు బోర్డు రాసిపెట్టాడు. తిరుపతిలో ఎల్.ఐ.సి. కార్యాలయంలో డబ్బుకట్టే కౌంటర్ ముందు బోర్డు రాసి పెట్టారు.



(13871) CHANGE FOR HEALTH
Hyderabad, 22/7/09
~~Dear~~/Respected, Brigadier P. Ganesham VSM(Retd),
Greetings. As per estimates of world health organization, every year in our country 7 lakhs 80 thousands people are dying due to un safe water, improper hygiene and poor sanitation. In our country 15% of over all diseases burden is due to these three causes please practice three interventions and prevent thirteen Major diseases due to un safe water, improper hygiene and poor sanitation.
I. Drink boiled and cooled water. Boil the water for 15 minute from boiling point. Allow the water to cool in the same vessel in which you boil. Filter the water before boiling if necessary.
II. wash the hands with water and soap before eating food after defecation. After washing hands for eating food don't wipe the hand with cloth.


పాఠశాల విద్యార్థుల నుండి ఐ.ఎ.యస్. అధికార్ల దాకా ఫోన్ చేసి మాట్లాడారు. అసెంబ్లీలో చదివారు. ఒక రిటైర్డ్ తెలుగు మాస్టారు రైలు ప్రయాణంలో ప్రయాణీకులకు కార్డు చదివి వినిపించారు. తిరుపతిలో ఒక జర్నలిస్టు జేబులో పెట్టుకొని తెలిసిన వారందరికీ చూపెట్టాడు. ప్రొద్దుటూరులో ఒక వ్యాపారస్తుడు అంగడికి వచ్చిన వారందరికీ చదివి వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వంలో డిప్యూటీ డైరెక్టరు స్థాయి అధికారి తన కార్యాలయంలో టేబుల్ అద్దం క్రింద ఉత్తరాన్ని సంవత్సరం పాటు పెట్టారు. ఎలా

అయితేనేమి, ఎక్కువ మంది పదిలంగా దాచుకున్నారు. ప్రస్తుత ఎన్నికల కమీషనర్ శ్రీ వి.యస్. సంపత్ రెండు సంవత్సరాల క్రిందట కేంద్ర రసాయనాలు, పెట్రోలియం శాఖ కార్యదర్శిగా ఉండేవారు. అప్పుడు ఆయన ఢిల్లీనుండి అరగంట ఫోన్‌లో మాట్లాడి, ఇంగ్లీషులో అనువాదం చెప్పించుకొని, ఇంగ్లీషులో రాసి పంపమని కోరటం డాక్టరుకు మరచిపోలేని అనుభూతి. ఆయన వల్లే ఇంగ్లీషులో ఇతర రాష్ట్రాలకు "ఆరోగ్యం కోసం మార్పు" – "ఛేంజ్ ఫర్ హెల్త్"గా చేరింది. జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచి నుండి టైమ్స్ ఆఫ్ ఇండియా విలేఖరి శ్రీ జయదీప్ థియో గారియా ఎందుకు ఇలా ఉత్తరాలు రాశారు అని డాక్టరును అడిగారు. "హాబీ అన్నారు డాక్టరు గారు. ఫ్యాషన్ అన్నారు జయదీప్" సంస్థాగత రూపం ఇవ్వకుండా వ్యక్తిగా చేయడం కరెక్టు కాదు అని ఒక మిత్రురాలి ప్రశ్న. సంస్థాగత రూపం ఇచ్చుటకు చేయని ప్రయత్నం లేదు. అయితే ఎవరూ కలసి రావటం లేదని డాక్టరుగాని జవాబు. "హనీబీ – ఆంధ్రప్రదేశ్ చీఫ్ కో–ఆర్డినేటర్ బ్రిగేడియర్ గణేశం గారి మాటల్లో చెప్పాలంటే "ఇదొక నిశ్శబ్ద విప్లవం".

ఇదొక సుదీర్ఘ ప్రస్థానం. ఎన్నో ఎత్తు పల్లాలు. చాలామంది అభిమానులు కార్డులు కాపీ చేసి పెట్టారు. కొన్ని వేల కార్డులు నాణ్యత లేనందువల్ల, తప్పులున్నందువల్ల చించివేశారట. గుంటూరు జిల్లా రేపల్లె నుండి ఒక అభిమాని 1200 కార్డులు తానే రాశి పోస్ట్ చేశారు.

7-4-2008 ప్రపంచ ఆరోగ్య దినం. ఆరోగ్యంపై వాతావరణ మార్పు గురించి సందేశం. ఈ సందేశం గురించి 617 పోస్ట్ కార్డులు పంపారు. మన సమాజంలో శిశు మరణాలు – ప్రసూతి మరణాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్న అంశాలు. పది చిన్న చిన్న అంశాలు పాటిస్తే శిశు మరణాలు, ప్రసూతి మరణాలు గణనీయంగా తగ్గించ వచ్చు. 2008 నూతన సంవత్సర సందేశంగా ఈ అంశంపై ఉత్తరం రాసి 931 కార్డులు పంపారు. 2009 నూతన సంవత్సర సందేశంగా ఆరోగ్య రక్షణలో ప్రజల భాగస్వామ్యాన్ని కోరుతూ 468 మందికి ఉత్తరాలు రాశారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారము మనదేశంలో టీకారు కార్యక్రమం, జననాల నమోదు బాగా జరగటం లేదు. ఈ అంశంపై 1212 మందికి ఉత్తరాలు పంపారు. ఇదొక నిరంతర కార్యక్రమం. 1-8-2009 నుండి 7-8-2009 వరకు జరిగిన తల్లిపాల వారోత్సవాల గురించి 711 మందికి ఉత్తరాలు పంపారు. 28-9-2009 నాడు నిరంతర కార్యక్రమంగా ఆరోగ్యంపై పొగాకు ప్రభావము గురించి ఉత్తరాల కార్యక్రమం మొదలెట్టాడు. ఇప్పటికి కేవలం 11 మందికి పంపారు.

డాక్టరు రామయోగయ్య ఒక రిటైర్డ్ ప్రభుత్వ డాక్టరు. రాష్ట్ర తల్లిపాల ఉద్యమంలో రూపకర్త, ఉత్తరాలు రాసే డాక్టరు అంటే ఆయనకు సంతృప్తినివ్వదు. అసలేమీ చేయలేదు అని ఆయన నిర్వేదం. ఆరోగ్యాన్ని గురించి ఆయనొక దార్శనికులు. ఆరోగ్యమంటే కేవలం వైద్యమే అని అనుకోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తున్న సమస్య. ఆరోగ్యమంటే మంచినీరు, పారిశుధ్యం, తగినంత శుభ్రమైన ఆహారం, రక్షిత వాతావరణం, గృహ వసతి, మంచి అలవాట్లు, అందరికీ అక్షరాస్యత, ఆర్థిక సమానత్వం, వనరులలో సమానత్వం, వసతుల్లో సమానత్వ, పొగాకు, మద్యం అలవాట్లు లేని సమాజం, ప్రమాదాలు జరగని ప్రయాణాలు, శరీరానికి పని ..... మరియు అందరికీ అందుబాటులో శాస్త్రీయ వైద్యం. వైద్య సేవల్లో వ్యాపార దృష్టి పోవాలంటారు రామయోగయ్య. వైద్యంతో పేదరికంలోకి నెట్టబడుట, వైద్యంతోనే జబ్బులు – సైన్సు ఫెయిలయిందో, సైన్సును ఫెయిల్ చేశారో చర్చ జరగాలంటారు. వైద్య విద్యను, నర్సింగు విద్యను అవసరాలకు అనుగుణంగా రూపు దిద్దాలంటారు. పాఠశాలల్లో ఆరోగ్యాన్ని గురించి బోధనాంశంగా ప్రవేశ పెట్టవచ్చు అంటారు. ఆరోగ్యంలో అసమానతలు కూడదంటారు. వైద్య విద్యను, నర్సింగ్ విద్యను, పారా మెడికల్ విద్యను మరియు వైద్య సేవలను దశలవారీగా జాతీయం చేయటమే ప్రస్తుత ఆరోగ్య సమస్యలకు అంతిమ పరిష్కారం అంటారు డాక్టరు ఆరవీటి రామయోగయ్య.




**డా. రామయోగయ్య మాకు తారస పడటం, ఆయనను గురించి పాఠకులకు తెలియజేయడం మా భాగ్యంగా భావిస్తున్నాం. డాక్టరుగారి సెల్ నెంబరు 98496 69282.**

– ఎడిటర్

# చంపారన్ లో 22వ శోధయాత్ర



22వ శోధయాత్రకు 'చంపారన్' నుండి పిలుపు వచ్చింది. ఈ శోధయాత్రలో మేము ఒక యువ విద్యార్థి ధాన్యం నిల్వ చేసే గాదెలపై చెక్కిన అపురూపమైన చిత్రాలను చూశాం. అంతర్జాతీయ పరిశోధకుల సదస్సులో వీటిని ప్రదర్శించటం జరిగింది. కాలుష్య నివారణకు, అపరిశుభ్రతకు, రవాణా మొదలగు వాటికి పరిష్కారాలు సూచించడ, జరిగింది. అలాగే మేధావుల నుండి సాంప్రదాయక విజ్ఞానాన్ని తెలుసుకున్నాము. ఈ 22వ శోధయాత్ర 2008 డిసెంబర్, 29న మోతీహారి నుండి ప్రారంభమై 2009 జనవరి, 3వ తేదీన 'లారియా'లో ముగిసింది. సమాధానం లేని ప్రశ్న ఒకటి ఇప్పటికీ అలాగే ఉండిపోయింది. ఇంతకాలమయినా ఈ ప్రాంతం ఆర్థికంగా ఎందుకు పతిష్టం కాలేదు?



దేశ చరిత్రలో చంపారన్‌కు ఒక ప్రత్యేక స్థానం ఉంది. 1917లో నీలిమందు మొక్కలు పెంచే రైతులను దోచుకుంటున్నారన్న వాస్తవాన్ని గ్రహించిన గాంధీజీ ఇక్కడినుండే 'సత్యాగ్రహం' అనే ఒక సరిక్రొత్త ఆయుధానికి శ్రీకారం చుట్టారు. ఈ అనుభవం 1929లో సంపూర్ణ స్వాతంత్ర్యం సముపార్జనకు పిలుపు నిచ్చింది. రాజ్ కుమార్, ఇతరులు నీలిమందు మొక్కలు పెంచే రైతుల నష్టాలను చూడటానికి రమ్మని ఆహ్వానించినప్పుడు, ఆ రైతులను దోచుకుంటున్న విధానం ఇంత తీవ్రఃగా ఉంటుందని ఊహించలేదు. దురదృష్టకర, ఏమిటంటే స్వాతంత్ర్యం సిద్ధించి 60 సంవత్సరాలు దాటినప్పటికి ఈ దోపిడీ వ్యవస్థ అంతం కాలేదు. కూలీలకు జీతాలు తక్కువగా ఉంటూ, వారి ఆర్థిక స్థితి అత్యంత దయనీయంగా ఉంటోంది.

శోధయాత్ర లాంఛనంగా డిసెంబర్ 29వ తేది ప్రారంభం అయినప్పటికి 28 రాత్రే విషయ సేకరణ అనేది ప్రారంభమైంది. వీరేంద్ర కుమార్ సిన్హ అనే వ్యక్తి వాతావరణ, శబ్ద కాలుష్య నివారణకు అనుగుణంగా పనిచేసే సైలెన్సర్ కనుగొన్నాడు. రోజాదిన్ అనే వ్యక్తి ఒక సమర్థవంతమైన 'కాఫీమెషిన్' ను రూపొందించాడు.

**మహాత్మాగాంధీకి నివాళులు:**

మహాత్మాగాంధీ సమాధి వద్ద ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా ప్రశ్న ఉత్పన్నమైంది. సృజనాత్మకత కలిగిన వ్యక్తులను ఒక పల్లెల్లోనే కాక, అన్ని ప్రాంతాలలో ఉన్న వారిని వెలుగులోకి తేలేక పోతున్న ఈ



సమాజంలో శోధయాత్రలు అవసరమా? అని. ఈ ప్రశ్నకు సంతృప్తికరమైన సమాధానం దొరకలేదు. దీనికి మనం మన సాధారణ ఆలోచనా దృక్పథాన్ని, నివాస ప్రాంతాల చరిత్రను, ఆదర్శాల పట్ల మొండిగా, మూఢాచారాలు అభివృద్ధి నిరోధ కాలుగా పూర్వ చరిత్రను, అభివృద్ధి సాధకులలోని జడత్వాన్ని నిందించాలి.

మహాత్మాగాంధీకి నివాళులు అర్పించిన తరువాత మా నడక ప్రారంభమైంది. 'మోతిహరి'కి భారతదేశ చరిత్రలో సముచిత స్థానం లభించలేదని అనేకమంది పాతకాలపు గాంధేయవాదులు వాపోయారు. బంజారియా గ్రామంలో సంతోష్ అనే ఒక యువకుడు వేసిన చిత్రాలకు అందరు ముగ్ధులయ్యారు. అతను తన కళా ప్రతిభను భిన్న కోణాలలో వ్యక్తీకరించాడు.

ప్రక్క గ్రామానికి బయలుదేరే ముందు ఉన్నట్టుండి మాముందు ఒక అనూహ్యమైన దృశ్యం కన్పించింది. ఒక ఇంటి బయట బంక మన్నుతో తయారు చేయబడిన ఒక వృత్తాకార ధాన్యాగారం ఒక అనూహ్యమైన చిత్రకారుని పనిగా తోచింది. మేము విచారించి వివరాలు తెలుసుకున్నాం. శ్రీమతి రామ్ తివారిదేవి అనే బైలా గ్రామవాసి ఈ ధాన్యాగారాన్ని తయారు చేశారు. ఈ కళను ఆమె తన తల్లి వద్దనుంచి నేర్చుకుంది. అలాగే ఈ ధాన్యాగారం చేయడానికి ఇది ఒక్కటే మార్గం అని భావించింది. ఎప్పుడైతే కళ ఒక్కటే ప్రత్యామ్నాయంగా మిగులుతుందో అప్పుడు సృజనాత్మకత తన ఉద్దేశ్యాన్ని, తన ఉపయోగాన్ని తాను సాధిస్తుంది. మిగిలిన ప్రయాణంలో అలాంటి డిజైన్స్ కోసం చూశాం. రక రకాల చిత్రాలు, బొమ్మలు కనిపించాయి. కాని అలాంటి చాతుర్యంతో కళాత్మకంగా తయారు చేసిన ధాన్యాగారం మరెక్కడా కనిపించలేదు.

సుమారు 100 కి.మీ. దూరం నడిచి వెళ్ళినా మళ్ళీ అలాంటి కళాత్మక సృష్టి, దానిని పోలినది చూడలేదు. ఆమె ఎంత భిన్నమైనదో ఆమెకు తెలుసా? ఈ జీవన పోరాటంలో పని స్థలమే ఆమె జీవితానికి, కళాత్మకతకు ముడిపడి వుందన్న నమ్మకం ఆమెకున్న విధేయతను, అంకిత భావాన్ని ప్రణాళికలు తయారు చేసేవారు, మేధాశక్తితో ఆలోచించేవారు తెలుసుకో గలిగారా?

పాఠకులు ఉత్తర ప్రదేశ్‌లోని భాగ్‌పేట దారి ప్రక్కన పేడ కుప్పలపై, పశ్చిమ బెంగాల్ లోని పురూలయా పూరి గుడిసెలపై ఇలాంటి కళాత్మక పనితనాన్ని చూసి ఉండవచ్చు. స్త్రీలు వారికి అనువైన ప్రదేశాలలో అనువైన రీతిలో ఇలాంటి సృజనాత్మకతలను సృష్టించడం అనేక పర్యాయాలు చూశాం. గృహ సంబంధానికే పరిమితం కాకుండా, ఒక సంస్థ స్థాయిలో వారి జ్ఞానానికి పరిణతి కల్పిస్తే వారిలోని సృజనాత్మక శక్తి మరింత ప్రస్ఫుటంగా వెలుగు చూస్తుంది. అంతే కాక వారికి ఆర్థికంగా లాభదాయకం అవటానికి అవకాశం వుంటుంది.

అజ్గరి గ్రామం దాటిన తరువాత గోకుల్‌లో మధ్యాహ్నం భోజనం చేసుకొని మొహమ్మాపూర్ లోని 'భటక మియాకీ మజార్' అని పిలువబడే ఒక జ్ఞాపక చిహ్నాన్ని దాటుకొని వెళ్ళాం. భటకమియా ఒక స్వాతంత్ర్య సమర యోధుడు. ఇంతకాలంగా అతనిని మరచి పోయిన సమాజం ఇటీవలే గుర్తు చేసుకున్నారు.











ఇక్కడ యాత్రికులు కర్మల ఖాన్ అనే 60 సంవత్సరాల వృద్ధుడ్ని కలుసుకోవడం జరిగింది. ఇతను పంటి జబ్బులకు, బెణుకులకు, కడుపు నొప్పికి మందులను వివిధ అనారోగ్యాలకు మూలికా వైద్యం చేస్తారు. ప్రతిరోజూ ఉదయం క్రమం తప్పకుండా నెల రోజులపాటు నల్ల మిరియాలు నమిలి మ్రింగితే నడుం నొప్పి తగ్గిపోతుంది. సిస్వేనియా, గోచారి, మౌఖిలేష్ పూర్ ద్వారా మేము వెళ్ళేటప్పుడు అక్కడక్కడ దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కొన్ని పరిశోధనలను చెన్నయ్‌కి చెందిన డాక్టర్ జనార్ధన రెడ్డి, శ్రీ నారాయణ రూపొందించిన రెండు వైపుల కన్పించే తెరపై ల్యాప్‌టాప్ ద్వారా ప్రదర్శన వేసి చూపించాము. మేము భెలాఛెప్రా ప్రాథమిక పాఠశాలలో బస చేశాము. అక్కడినుండి సెమ్రాకు బయలుదేరాం. చాప్రాబహస్‌లో బైద్యనాథ ప్రసాద్ అనే ఒక స్వాతంత్ర్య సమరయోధుని కలిశాం. అతను ఒక చక్కని దేశభక్తి గేయంపాడి వినిపించాడు. అలాగే మూలికా వైద్యానికి సంబంధించి అతని జ్ఞానాన్ని, అనుభవాలను మాతో పంచుకున్నాడు. ఇతనిని సన్మానించి, తరువాత శోధయాత్రికులు మరొక స్వాతంత్ర్య సమరయోధుడు జనాబ్ షక్ యూసఫ్‌ను అతని ఇంటివద్ద సన్మానించాం.

సుగౌలి లో పాఠశాల విద్యార్థులకు ఔషధ మొక్కల సేకరణపై పోటీలు నిర్వహించాం. అలాగే అక్కడి స్థానిక మూలికా వైద్యులను, పరిశోధకులను సన్మానించడానికి ఒక చిన్న సభ ఏర్పాటు చేశాం.

స్థానికులకు సాంప్రదాయ వైద్య విధానం ద్వారా మూలికా ఔషధాలు ఇస్తున్న శ్రీ ప్రమోద్ స్టీఫెన్ మమ్ములను తన ఇంటివద్ద ఆపారు. మధోపూర్ కృషి విజ్ఞాన కేంద్రానికి వెళ్ళే దారిలో మేము అనేక పరిశోధనలను, మూసివేసిన చక్కెల మిల్లులను సందర్శించు కుంటూ వెళ్ళాము. అభయ్ కుమార్ యాదవ్ అనే ఒక 7వ తరగతి విద్యార్థి రూపొందించిన 'ఎలక్ట్రో మేగ్నటిక్ కలెక్టర్' అనే పరికరాన్ని చూశాం. ఇది చెత్త నుంచి కంపోస్టు ఎరువు నుంచి ఇనుప ముక్కలను వేరు చేస్తుంది. దీనిమూలంగా పొలాలకు ఎరువు తోలినప్పుడు అందులోని ఇనుప ముక్కలు పశువులకు గుచ్చుకొని ప్రమాదాలు జరగకుండా నివారిస్తుంది. మా యాత్ర మొత్తం 'క్రింద ధరిత్రి – పైన ఆకాశం – మధ్యలో వెలుగులు చిమ్మే ప్రకాశవంతమైన విజ్ఞానం' అన్న నినాదంతో కూడిన జెండాను పట్టుకొని తిరిగాడు శ్రీ స్టీఫెన్.

జుఖాటియా వెళ్ళే దారిలో ఇద్దరు కార్మికులు ఒక స్టాండుమీద ఉండి ఎండిన పామాయిల్ చెట్టు మొదలును రంపంతో కూస్తున్నారు. దీని డిజైన్ మునుపెన్నడూ చూడనిదిగా, తమాషాగా వుంది. మా యాత్రీకులలో ఒకరికి కాలి నొప్పి రావడంతో శ్రీ గణేష్ బైతా అనే మూలికా వైద్యులు వైద్యం చేశారు. అతను దీనికి మందును సూచించాడు. మొట్ట మొదటిసారిగా మీరు దీనిని ఎలా నేర్చుకున్నారు అని ప్రశ్నించారు యాత్రికులు. ఇందుకు శ్రీ గణేష్ ఒక చిన్న కవిత రూపంలో సమాధానం ఇచ్చాడు.





మైన కాళీమాత ఆలయం వద్ద కాసేపు ఆగాము. రాణిపూర్‌లోని బున్యాది విద్యాలయం చేరుకునే సరికి ఉపాధ్యాయులు, పిల్లలు ఒక పెద్ద వేడుక జరుపుకున్నారు. 1939లో బృందావన్‌లో జాతీయ స్థాయిలో ఆరు రోజులు రహస్య సమావేశాలు నిర్వహించిన తరువాత మహాత్మా గాంధి స్థాపించిన మొట్టమొదటి బున్యాది పాఠశాల ఇది. ఇక్కడ 'ప్రేరణకుటీరం' అనే పేరుతో ఒక జ్ఞాపకార్థ చిహ్నాన్ని నిర్మించి శ్రీ మధుర భగత్ అప్పటినుండి నిర్వహిస్తున్నారు.

ఈ వేడుకలలో అత్యంత ప్రధానమైనది అంతర్జాతీయ స్థాయిలో 'నార్వే'లో నిర్వహించిన యువజనోత్సవాలకు తమ గ్రామాన్ని ప్రాతినిథ్యం వహిస్తూ హాజరైన 11వ తరగతి విద్యార్థి రోహిత్ కుమార్ మిశ్రా ఉపన్యాసం. అనంతరం యాత్రికులు అందరు 'ప్రేరణకుతి'ని సందర్శించి మధుర భగత్ గాంధీజీ గురించి వివరించిన ప్రాచీన, చారిత్రక విషయాలను ఆసక్తికరంగా విని వివిధ విషయాలు తెలుసుకున్నారు.

**'ఎవరికి ఏం చెప్పాలి?**
**ఎవ్వరూ మూర్ఖులు కారు.**
**అందరూ మేధావులే'**

అనంతరం మంజిహా వాలియాలోని మోతీలాల్ ఉన్నత పాఠశాలలో అలాగే మహొాదిపూర్‌లోని ప్రాథమిక పాఠశాలలో ఆయా ప్రాంతాలలో లభ్యమయ్యే 'బయో డైవర్సిటీ'ని ఉపయోగించుకొని స్థానిక అంశాలను ఎలా తయారు చేయవచ్చు అనే అంశాలపై ఆసక్తికరమైన చర్చ సాగింది. దీనికి ఉదాహరణగా గుజరాత్‌లోని కచ్‌లో నేర్చుకున్న ఒక పాఠాన్ని ఉటంకించడం జరిగింది. మూలికా పురుగుల మందు గురించి విన్న తరువాత ఒక రైతు తాను అర్థం చేసుకున్నది ఈ విధంగా చెప్పారు. 'జంతువులు తినని అన్ని మొక్కలు ఈ మూలికా పురుగుల మందు తయారీకి మూలం'. రైతులు అంతర్ దృష్టితో ప్రయోగాత్మకంగా ప్రయత్నాలు చేయడం హర్షించదగ్గది. తాత ముత్తాతలు, మనుమలు, ముని మనుమలు మధ్య బాంధవ్యాలు సన్నగిల్లడం అనగా తరాల మధ్య అంతరాలు ఏర్పడడం కూడా విజ్ఞానం అంతరించి పోవడానికి కారణభూతమవుతోంది అన్న విషయంపై కూడా చర్చ సాగింది. బెట్టయ్యలోని బిపిన్ ఉన్నత పాఠశాల చేరుకునే సరికి రాత్రి బాగా పొద్దు పోయింది. చాలామంది యాత్రికులు బాగా అలసిపోయారు. కొంతమంది నూతన సంవత్సర వేడుకలు జరపుకోవడానికి సమాయత్తమయ్యారు. మరుసటి రోజు యాత్ర నిషాంత్, సందీప్, మీరజ్, జానకిదేవి, ఇతర విజ్ఞాన ఖనులు తోడవటంతో అత్యంత విజ్ఞానదాయకంగా సాగింది.

రాణిపూర్ పోయే దారిలో పురాతన

అప్పటికే సాయంకాలమై చీకటి పడింది. జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ శ్రీ ఎ.ఎస్. ప్రకాష్ రావు చక్కగా స్పందిస్తూ శోధయాత్రికులతో పరస్పర చర్చల కోసం 400 మంది విద్యార్థులను ఆహ్వానించారు. కోడిగుడ్డుపై పెంకు పగులగొట్టేందుకు





రూపొందించిన యంత్రానికి గాను విశ్వ భారతి మొదటి బహుమతి పొందింది. అలాగే క్రొత్తగా ప్రెషర్ కుక్కర్, కాయగూరలను తరిగి, కడిగే యంత్ర రూపకల్పన గురించి రామ్‌కుమార్ వివరించారు.

తరువాత మజిలీలో శోధయాత్రికులు పలు రకాల వంటకాలైన గుమనాసాగ్, గులర్ కా హల్వా మరియు మధుకా హల్వా లాంటివి రుచి చూశారు. గుమా అనేది శోధయాత్రీకులు ప్రయాణం చేసినంత దూరం, దారి ప్రక్కన లోతైన నేలలో కన్పించే మొక్క. దీని ఆకులు నొప్పుల నివారణకు, వేర్లు పంటి నొప్పి నివారణకు పని చేస్తాయి. ఇలాంటి మొక్కలు స్థానిక విజ్ఞానానికి ప్రతీకలుగా నిలుస్తాయి. ఈ మొక్కలు విస్తారంగా ఉండటంతో పేద, ధనిక తేడా లేకుండా అందరికి అందుబాటులో ఉంటాయి.

'బెట్టయి' లోని 'సాహీద్ చౌక్' సందర్శన ఒక తీపిగుర్తు జయప్రకాష్ నారాయణ గారు చేపట్టిన 'నవ నిర్మాణ' ఉద్యమంలో అనేకమంది యువకులు పోలీసు కాల్పులలో మరణించడం జరిగింది. వారి జ్ఞాపకార్థం ఈ చిహ్నం నిర్మింపబడింది. మమ్ములను మీరజ్ ఆహ్వానం పలికి తన యువసేనకు పరిచయం చేశారు. వారంతా విద్యా విధానంలో సమూల మార్పులకు కృషి చేస్తున్నారు.

శ్రీ సిన్హా రూపొందించిన 'కాలుష్య నివారణ పరికరం' పరిమాణంలో చాలా పెద్దది. కాని, నందీశ్వర శర్మ ద్విచక్ర వాహనానికి ఉండే ఎగ్జాస్ట్ పైప్ లాంటి పరిమాణంలో చాలా చిన్నదిగా సైలెన్సర్ మరియు కాలుష్య నివారణ పరికరంగా పని చేసే క్రొత్త పరికరాన్ని రూపొందించారు. చివరి రోజు 'పద్రి', 'కుద్వామతియాబ' మీదుగా 'మూరాహియా' చేరుకున్నాం. అల్లంత దూరం నుంచే కొందరు శ్రామికులు మమ్ములను చూస్తూ ఉన్నారు. కాని వారు కూడా మాతో చేరేట్లు నమ్మకాన్ని మేము కల్గించలేక పోయాం. చివర మజిలీ అయిన లారియా చేరేముందు 'నిందన్ ఘర్‌కోట', 'బుద్ధుని స్థూపం' సందర్శి,చుకున్నాం. ఒక ఇటుకపై మరొక ఇటుక పేరుస్తూ మా కళ్లముందు నిల్చిన సుమారు 2000 సంవత్సరాల నాటి ఆ సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన భవన నిర్మాణ శిల్ప సౌందర్యం మమ్ములను ఆశ్చర్య చకితులను చేసింది. ఆరోజులలో ఇటుకల తయారీలో బంకమన్నుతో వివిధ పప్పు దినుసులు, గింజలు కలిపి ఏ విధంగా ఇటుకలు కాల్చేవారో అక్కడి స్థానిక గ్రామీణ వాసులు విపులంగా వివరించారు.

సుమారు 2000 సంవత్సరాల పాటు అనేక ఆటు పోట్లకు, ప్రకృతి వైపరీత్యాలకు తట్టుకొని చెక్కు చెదరకుండా సజీవ సాక్షిగా నిల్చిన ఇలాంటి సాంకేతిక పరిజ్ఞానం ప్రస్తుత ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో సంస్థాగత విలువలలో తగు గుర్తింపు గ్రాహ్యత కొరకు ఇప్పటికీ ఎదురు చూడటం ఆశ్చర్యం కాదా? ఒక ప్రశ్న ఇప్పటికీ సమాధానం లేని ప్రశ్నగానే మిగిలిపోయింది. దారిద్ర్యం, దోపిడీ, అధికారం లాంటి వాటినుండి విముక్తి, అలాంటి నిజమైన స్వాతంత్ర్యం కొరకు జాతిపిత మహాత్మాగాంధి ఇచ్చిన పిలుపు ఇన్ని సంవత్సరాలు గడిచినా సమాధానం లేని ప్రశ్నగా ఎందుకు మిగిలి పోయింది? ఆర్థిక స్వాతంత్ర్యం అనేది అధిక శాతం సాధించవలసిన సమస్యగా ఇప్పటికీ మిగిలిపోయింది.

ఈ ప్రస్థానం మనలో ఒక పట్టుదల, ధ్యేయం, ఆత్మ విశ్వాసం మనస్సులలో నాటుకొనేట్లు చేసి స్థానిక పరిజ్ఞానం, వనరులు, సంస్థల వికేంద్రీకరణ మూలంగా ప్రత్యామ్నాయ ఔత్సాహికతకు దోహదపడాలి.

మూలం : 'హనీబీ' ఆంగ్ల త్రైమాసిక పత్రిక



# మట్టిమేట వేయని ఆనకట్ట వినూత్న నమూనా !



**- గాదేపల్లి సుబ్రహ్మణ్యం విజయనగరం**


మనదేశంలో ఎక్కువ ప్రాంతాల్లో వ్యవసాయమే వర్షాధారం. వర్షాల వల్ల కురిసే నీరు, నేలలో ఇంకగా, మిగిలినది వాగులూ, వంకలూ, గెడ్డలూ, ఏర్ల ద్వారా ప్రవహించి, నదులలో కలిసి చివరికి సముద్రంలో చేరుతుంది. ఆ నదులపైన ఆనకట్టలు నిర్మించి, జలాశయాలు ఏర్పరచి, ఆ నీటిని నిలువచేసి కాలువల ద్వారా పంట భూములకు అందించడం జరుగుతోంది. పెద్దపెద్ద ఆనకట్టలు నిర్మించడం ద్వారా నీటిని నిలువ చేయగలుగుతున్నా, ఆ జలాశయాల వల్ల విలువయిన పంట భూములు, కొన్ని గ్రామాలూ ముంపుకు గురవుతున్నాయి. ఆనకట్టల వల్ల నదిలోని నీటిని నిలువజేయబడ్డా, వాటి నిలువ స్థోమత ఇసుకమేటల (సిల్ట్) వల్ల తగ్గిపోతోంది. ఆ మేటలను తొలగించడానికి 'తవ్వోడ' (డ్రెడ్జెస్) వాడవలసి వుంటుంది. అది ఖర్చుతో కూడుకున్న పని. చిన్న చిన్న నీటి వనరులను నిలువ చేయటానికి 'చెక్ డ్యామ్'లు ఉపయోగంగా ఉంటాయి. అయితే ఈ డామ్‌లు ఇసుక మేటల వల్ల నిరుపయోగంగా తయారవుతున్నాయి. ఇక్కడ సూచించిన నమూనాలో డ్యామ్ నిర్మాణం చేపడితే ఈ ఇసుకమేటలు వేయటాన్ని నివారించవచ్చు.


ఏటిగట్టుకంటే ఒక మీటరు తక్కువగా (ప్రవాహ అంచనాను బట్టి మారవచ్చు) ఏటికి అడ్డంగా ఒక గట్టి కట్ట నిర్మించాలి. ఆ కట్ట సిమెంటుతోనా, రాయితోనా, ఇటుక కట్టడంతోనా అన్నది ఆ కట్ట కట్టే స్థలంలోని మట్టి, నేల స్వభావం పై ఆధారపడి వుంటుంది. ఆ కట్టకు నీటి ప్రవాహం ఎగువకు, ఆ ఏరు వెడల్పునా ఒక పడగ (వింగ్) ఆకారంలో, కట్టకు మీటరు పైగా నేల మట్టానికి ఒక మీటరు పైన, సిమెంటు కాంక్రీటులో నిర్మాణం చేయాలి. ఈ పడగను ఏటికి అడ్డంగా కట్టిన కట్టకు సంధానం చేసి, నీరు దిగువనుండి పడగలో నుండి మాత్రమే ప్రవహించేదిగా చేయాలి. వర్షం వల్ల నీరు చేరినపుడు కట్ట లెవెల్ వరకు నీరు నిలవ వుంటుంది. అంతకు మించి నీరు వస్తే నీటి అడుగునుండి పడగ ద్వారా మాత్రమే దిగువకు ప్రవహిస్తుంది. ఈ క్రమంలో క్రింద మేట వేసిన ఇసుక, మట్టి, చిన్న చిన్న రాళ్ళు, నీటి ప్రవాహంలో ఏటి దిగువ ప్రాంతాలకు కొట్టుకొనిపోయి, జలాశయంలో ఇసుక, మట్టి ఉండకుండా నీరు మాత్రమే నిలుస్తుంది.

వర్షాలు ఆగిన రెండు మూడు నెలల వరకు అక్కడి నేల స్వభావాన్ని బట్టి నీరు నిలువ ఉంటుంది. నీరునిలువ ఉంటే ఆ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరుగుతాయి. గట్టు ఎప్పుడూ పచ్చదనంతో ఉండి పశువులకు మేత ఏర్పడుతుంది. బహుళార్థ సాధక ఆనకట్టలు ఖర్చుతో కూడుకున్న పని. ఇటువంటి చిన్న చిన్న ఆనకట్టల వలన ఆయా ప్రాంతాల్లో నీటి ఎద్దడి తగ్గుతుంది.

కొంచెం వెడల్పుగా ఉన్న ఏటికి కూడా ఇటువంటి కట్టలు కట్టవచ్చు. పోతే పడగ ఏకమొత్తంగా కట్టకుండా, పది పదిహేను అడుగుల దూరంలో స్తంభాలు నిర్మించి (అంటే ప్రహరీ గోడ కట్టేటప్పుడు పది అడుగులకు ఒక స్థంభం పెట్టినట్టు) ఆ పడగను కొన్ని భాగాలుగా విభజించవచ్చు. ఇటువంటి కట్టలు ఒకటి రెండు కట్టి ఒక వర్షాకాలం చూస్తే ప్రయోజనాన్ని నిర్ధారించవచ్చు.

ఈ ఆలోచనను అందించినవారు **గాదేపల్లి సుబ్రహ్మణ్యం, 12-19-3, హనుమాన్ నగర్, విజయనగరం. ఫోన్ : 08922-227994, సెల్ : 94413 05695.** వారికి మా కృతజ్ఞతలు. - ఎడిటర్





# జాగో మనిషీ !

– ఉప్పుతేళ్ళ కృష్ణ, అనంతవరం, ప్రకాశం జిల్లా.

‘కొబ్బరికాయల కొట్టు సుబ్బారావు గారు పోయారా!’ పాపం! నిన్న రాత్రి 10 గంటలదాకా కొట్లో కూర్చొని మాట్లాడుకున్నామే – ఏమిటంటా? జబ్బేమీ లేదే! 55 సంవత్సరాల వయస్సు వచ్చినా మనిషి, గుండ్రాయిలాగా ఉన్నాడే! గుండెపోటా!’ కృష్ణ ప్రశ్నార్థకంగా అడుగుతుంటే కొట్లో గుమాస్తా మౌనంగా తలూపినాడు. అవునన్నట్లు.

‘ఏమికాలం! ఏమి మాయ! మా నాన్నకు దాదాపు 80 సంవత్సరాలు. పల్లెటూళ్ళో ఉంటారు. ఆయన పనులన్నీ ఆయనే చేసుకుంటారు. పొలం పనులు చేస్తారు. కూలీల చేత చేయిస్తారు’. ఇప్పటికి మూడుపూటల తింటారు. కాఫీ – టీ ముట్టరు పొలం పనులకు నాగాలెయ్యరు.



మా నానమ్మ చెబుతుంది – అప్పుడప్పుడూ ! మీ నాన్న మూడు సంంవత్సరాలు వచ్చేదాకా చనుపాలు తాగాడురా! గుమ్మపాలు అయితే పెద్దగ్లాసు తాగించేవాడు. మీదింకా నయం. మా అత్తమ్మ కొడుకు పోతురాజు లేదూ వాడయితే ఐదు సంవత్సరాల దాకా తల్లిపాలు ఒదలలేదు. ఆ తరువాత పెద్ద రాతిగుండును ఎత్తుతాడు. వస్తాదు అయ్యాడు.





తల్లిపాలను మించిన బలమైన ఆహారం లేదని ఎంతగా చనుపాలు త్రాగితే పిల్లలు అంత ఆరోగ్యంగా ఉంటారని చనుబాలు ఇచ్చిన తల్లులు రొమ్ము క్యాన్సర్‌కు దూరంగా ఉంటారని డాక్టర్లు చెబుతున్నారు. యూరోపియన్ దేశాల వారే ఈ విషయాన్ని ఇప్పుడిప్పుడే గుర్తించారని వార్తలు వస్తున్నాయి. వారు మారుతున్నారు కూడా. మరి మనవారో? తిండి మారింది. జొన్నలు తొక్కుకుని సంకటి, రొట్టెలు తిన్నన్ని రోజులు ఏ రోగాలు, రొస్టులూ లేవు. సన్నబియ్యం అని పిప్పు తింటున్నాము. రోజుకు 10 నుండి 20 కాఫీలు త్రాగేవారున్నారు.

ప్రపంచంలో డయాబెటిక్ పేషంట్లు (మధుమేహం) ఎక్కువమంది మన భారతదేశం లోనే ఉంటే అందులో డయాబెటిస్ నగరంగా హైదరాబాద్ పేరొందింది. మరీ పాలిష్ బియ్యం తింటున్నందువల్లనేమో! ఆ రోజుల్లో పశు పక్షాదులకు తిన్నంత తిండీ, మేత. మేత కోసం కొంత పొలం బీళ్లుగా మార్చేవారు రైతులు. వసంతకాలం వచ్చిందంటే ప్రకృతి ఎంత



రమణీయంగా మారేది. ఎక్కడ చూసినా పచ్చదనమే. ఎక్కడ విన్నా పక్షుల వింత శబ్దాలే. ఇప్పుకో కాంక్రీట్ జంగిల్స్ ఏర్పడ్డాయి.

కాలం ఎంత మారింది. అడవులు కనుమరుగవుతున్నాయి. ఇండ్ల పరిసరాలలో అటు ఇటు తిరిగే పిచ్చుకలు కనుమరుగయ్యాయి. గోరింకలు, కాకులు మారిన పరిస్థితులలో ఆహారం దొరకక జీవచ్ఛవాల్లాగా కొసప్రాణంతో కొట్టుమిట్టాడుతున్నాయి. బట్టమేక కనుమరుగు అయ్యింది. పాలపిట్ట జాడలు వెతకవలసి వస్తోంది. హతవిధీ! రాష్ట్ర వైశాల్యంలో 33 శాతం ఉండవలసిన అటవీ వైశాల్యం దాదాపు 10 శాతానికి వచ్చింది. రోజుకు మూడున్నర హెక్టార్ల వైశాల్యం నాశనమవుతోందని గణాంకాలు చెబుతున్నాయి. ఒక చెట్టు పెంచితే ఉసురు (ప్రాణవాయువు) ఇస్తుంది, రక్షణ (నీడ) ఇస్తుంది, బిక్షణ (తిండి) ఇస్తుందని అశోకుడు ఆ కాలంనాడే గుర్తెరిగి పెంచితే నేడు 'హైవే'ల వెడల్పు కోసం వేల చెట్లు నరికేస్తున్నారు. యస్.ఇ.జడ్.లంటూ వేల ఎకరాల సాగుభూమిని పారిశ్రామిక వాడలుగా మారుస్తున్నారు. జీవనదులను జీవంలేని నదులుగా మార్చేస్తున్నారు.


గంగానదికి జన్మస్థానమైన గంగోత్రి హిమనీ నదం సంవత్సరానికి 36 మీటర్లు కనుమరుగవుతున్నదని, రాబోవు కొద్ది సంవత్సరా ల్లో అసలు గంగానదే ఎండిపోవచ్చని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. నూలు మిల్లుల నుండి వెలువడే రంగులు, మలినాలు, తోళ్ళ పరిశ్రమ నుండి వచ్చే హానికర మలినాలు, యధేచ్ఛగా వాగుల్లో, నదుల్లో కలుపుతున్నారు. 5 శాతం మంది వారి వ్యక్తిగత లాభంకోసం మిగిలిన 95 శాతం మంది ఆరోగ్యాన్ని మంట గలుపుతున్నారు.

"ధర్మో రక్షతి రక్షితః
ప్రకృతీ రక్షతి రక్షితః"

వావి వరుసలు మంటగలిశాయి. పెద్ద, చిన్న తేడా లాకుండా పోయింది. ధర్మం ఆచరించేవారు వెక్కిరింతకు గురవుతున్నారు. ఎక్కడ చూసినా మదం – మద్యం – మనీ రాజ్యం ఏలుతున్నాయి. కన్నతల్లిదండ్రులు బిడ్డల నిరాదరణకు గురవుతున్నారు. క్షణం సుఖంకోసం ఏ అకృత్యమైనా చేయటానికి తెగబడుతున్నారు.


ప్రకృతికి మనం ఎంత ఇస్తే మనకు అంతకు రెట్టింపు ఇస్తుంది. అది మంచైనా, చెడైనా దానిలో భాగమే కదా. ఎయిడ్స్, స్వైన్‌ఫ్లూ, వైరల్‌ఫ్లూ, గ్లోబల్ వార్మింగ్, వర్షాలు లేకపోవటం, వరదలు ఎక్కువ కావటం ఇవన్నీ మానవ ప్రేరేపణలే కదా!

ఓ మనిషీ ఇప్పటికయినా మేల్కొను. నీ పరిధి తెలుసుకో. ప్రకృతిని ప్రేమించు. ద్వేషించకు. ప్రకృతిని నాశనం చేయకు. ప్రకృతిని నియంత్రణ చేసి నీ నాశనాన్ని కోరి తెచ్చుకోకు. అన్ని సమస్యలకు మూలకారణమైన జనాభా ఎదుగుదలను మొదటగా అదుపుచేయి. జాగో భాయీ జాగో!




# ప్రతిభ గుర్తింపుకు సరియైన పరిసరాలు అవసరమా?

అది జనవరి నెల. చలికాలం. ప్రొద్దున్నే వాషింగ్టన్ డిసి మెట్రో స్టేషన్‌లో రద్దీగా వున్న సమయంలో ఒక మనిషి కూర్చొని వయోలిన్ వాయించడం మొదలు పెట్టాడు. 45 నిమిషాల పాటు 6 పాటలు వాయించాడు. మొదటి మూడు నిమిషాలలో ఒక మధ్య వయస్సు మనిషి వయోలిన్ వాయిద్యకారున్ని గమనించాడు. నడత నెమ్మదించాడు. కొన్ని క్షణాలు ఆగిపోయాడు. వెంటనే వేగం పెంచి తన దారిన వెళ్ళిపోయాడు. ఒక నిమిషం తర్వాత వయోలినిస్ట్‌కు మొదటి టిప్ వచ్చింది. ఒక మహిళ పెట్టెలోకి ఒక డాలర్ విసిరేసి వెళ్ళిపోయింది. కొన్ని నిమిషాల తర్వాత ఒక వ్యక్తి సంగీతాన్ని ఆస్వాదించాలని గోడకు ఆనుకొని నిలబడ్డాడు. అయితే వెంటనే తన గడియారం వంక చూసుకొని మళ్ళీ నడక అందుకున్నాడు. అతను తన ఆఫీసుకు ఆలస్యం అయ్యాడనేది స్పష్టం. ఒక మూడు సంవత్సరాల వయసు బాలుడు మాత్రం పూర్తిగా శ్రద్ధతో, ఆసక్తిగా గమనించాడు. వాడి అమ్మ వెళ్ళి పట్టుకుని లాక్కెళుతున్నది. తొందర పెడుతున్నది. కానీ వాడు వయోలిన్ వైపు చూస్తూ ఆగిపోయాడు. చివరకు ఆమె గట్టిగా నెట్టింది. కానీ, వాడు పోయినంత దూరం వెనుకకు తిరిగి ఇటువైపే చూస్తున్నాడు.



చాలా మంది ఇతర పిల్లలు కూడా ఇలాగే చేశారు. అందరి తల్లిదండ్రులు వాళ్ళ పిల్లలను అలాగే ముందుకు నెట్టుకుంటూ వెళ్ళారు. ఆ వయోలినిస్ట్ వాయించిన ఆ 45 నిమిషాలలో, కేవలం ఆరుమంది మాత్రమే ఆగి కొంచెంసేపు సంగీతం వింటూ నిలబడ్డారు. కానీ వారి నడక వేగం ఏమాత్రం తగ్గించకుండానే డబ్బులు వేశారు ఇరవై మంది. అతను మొత్తం 32 డాలర్లు సంపాదించుకున్నాడు. అతను తన వాయిద్యాన్ని ఆపాడు, నిశ్శబ్దం చోటు చేసుకుంది. ఎవరూ అది గమనించలేదు. ఎవరూ ప్రశంసించలేదు. అచట ఏ గుర్తింపు లేదు. ఆ వయోలినిస్ట్ ఎవరు? అక్కడ ఎందుకు ఉన్నాడు? అన్న విషయం ఎవరికీ తెలీదు.

**ఆ వయోలినిస్ట్ ఎవరో కాదు ప్రపంచంలోని మహోన్నత విద్వాంసులలో ఒకరైన జోషూబెల్. 3.5 మిలియన్ డాలర్ల విలువ చసే వయోలిన్ ద్వారా క్లిష్టమైన పాటలను వాయించిన వ్యక్తి. రెండు రోజుల క్రితం అతను బోస్టన్‌లో ప్రదర్శించినపుడు, సగటున ఒక సీటుకు 100 డాలర్ల రేటు పలికింది. ఇది నిజంగా జరిగింది. ప్రజల ప్రాధాన్యతలు, అభిరుచులు, దృక్పథాలను గురించి సామాజిక ప్రయోగం చేయదలచి అందులో భాగంగా 'ది వాషింగ్టన్ పోస్ట్' జోషూబెల్ గారి రహస్య బహిరంగ వాయిద్య కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. దీనికి అంతరార్థం. మన చుట్టూ పరిసరాలలో తగిన సమయంలో ప్రకటితమవుతున్న అందాన్ని మనం చూడగలమా? కాస్త ఆగి ప్రశంసించ గలిగే స్థితికి మనం ఎదగ గలమా? మనం ఆయా సందర్భాలలోనే ప్రతిభా పాటవాలను గుర్తించ గలమా? పరిసరాల ప్రభావం లేకుండా ప్రతిభను గుర్తించటం సాధ్యం కాదా? సూక్ష్మ పరిశీలనకు చుక్కానియైన కంటిని, శ్రేష్ఠత గ్రహణకు చుక్కానిగా చెవిని మనం ఎప్పుడు పెంపొందించు కోగలం?**

మూలం : 'హనీబీ' ఆంగ్ల త్రైమాసిక పత్రిక.

# చిన్నారుల సహజ క్రియాశీలత - ఉజ్వల భవిష్యత్తుకు బీజం

- ప్రొఫెసర్ అనిల్ గుప్త



ప్రతి భారతీయుడు, భారతదేశం ఒక విజ్ఞాన భాండాగారంగా రూపొందాలని, భౌతిక ఆస్తులకన్న జ్ఞాన సంపదకు నిలువ నివ్వాలని కలలు కంటాడు. ఒక వ్యక్తి గాని, సమాజంగాని గమ్యాన్ని చేరుకోవడానికి చక్కని భావాలు, పరిశోధనలు, ఇతర జ్ఞాన సంపద ఎంతగానో తోడ్పడతాయి. కాని, భౌతికంగా, ఆర్థికపరంగా ఉన్నత స్థితి లేకపోవడం అనేది అంతగా ప్రభావం చూపదు. అన్ని వనరుల మార్కెట్ లాగానే సారూప్యత లేని జ్ఞాన సంపద మార్కెట్ కూడా ఉంటుంది. ఇతర విషయాలలో ఉన్న సారూప్యత లోపాన్ని సరిచేయడం కష్టతరమైనప్పటికి, ఈ విజ్ఞాన మార్కెట్‌లోని సారూప్యత లేమి తనాన్ని వ్యక్తిగా కాని, సామూహికంగా కాని, ప్రయత్నాలతో, పరిశోధనలతో సునాయాసంగా అధిగమించవచ్చు.

ఊహాజనిత సంకల్పాలకు, సంస్థా పరమైన ఊతం ఉన్నట్లయితే మన విజ్ఞాన వనరులు భారతదేశపు రూపు రేఖల్నే మార్చేయ గలవు. కానీ, వచ్చిన సమస్యల్లా పుట్టుకతో వచ్చిన బుద్ధులు పుడకలతో గాని పోవు అన్నట్లు అనాదిగా వస్తున్న అలవాట్లు, ఆచార వ్యవహారాలు అంత తేలికగా మారవు. అందుక మనం బాల్య దశలోనే ఈ ఊహాజనితకు, పరిశోధనలకు బీజాలు వేయకపోతే జీవితంలోని తరువాతి దశలో ఈ సృజనాత్మక శక్తిని మనం అలవరచు కునేటట్లు చేయలేం. ఇందుకొరకే 'సృష్టి' సంస్థ పిల్లల లోని సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి ఎప్పుడో పూనుకుంది. 1992లో 'సేవా' సహకారంతో మధురైలో నిర్వహించిన మొట్ట మొదటి బయో డైవర్సిటీ పోటీలలో సుమారు 116 రకాల జాతుల మొక్కలను, వాటి ఉపయోగాలను సేకరించిన 5వ తరగతి విద్యార్థి ప్రథమ స్థానంలో నిలిచాడు. అలాగే చాలా ఉత్తముడుగా భావించిన ఒక పెద్దాయన 240 రకాలు సేకరించగలిగారు. ఆ తర్వాత 1994లో బులందషేర్ జిల్లాలోని గంగాపూర్ గ్రామంలో ఇలాంటివి మరో రెండు పోటీలను నిర్వహించడం జరిగింది. ఆ తరువాతి కాలంలో ఇలాంటి పోటీలలో వేలాది మంది చిన్నారులు పాల్గొని తమ పరిసర పర్యావరణం లోని వివిధ విషయాలను గుర్తించి అపార జ్ఞాన సంపదను నిరూపించుకున్నారు. వాళ్ళలో కొద్దిమంది పిల్లలు మాత్రమే అందరికన్నా ఎంతో ముందుగా ఉండేవారు. చిన్నతనంలో మగపిల్లల కన్న ఆడపిల్లలు, అలాగే గిరిజనులు, ఇతర వెనుక బడిన వర్గాల వారి పిల్లలు ఇతరుల కన్న ఈ విషయాలలో ముందుండేవారు. దీనికి కారణం, ప్రకృతిమీద వారు ఎక్కువగా ఆధార పడి

జీవించడమే అన్న సత్యాన్ని మనము అర్థం చేసుకోవాలి. ఉన్నత వర్గాల పిల్లల విషయం వచ్చేటప్పటికి వారు సేకరించిన మొక్కల పట్ల ఎక్కువ శ్రద్ధ చూపుతూ, బయటికి వెళ్ళి క్రొత్త వాటికై అన్వేషణ సాగించడంలో బాలికల కన్నా, బాలురే ముందుంటారు.

తదుపరి సంవత్సరాలలో మేము శోధయాత్రలు చేపట్టినప్పుడు చక్కని సూచనలను, వినూత్న విషయాలను అందించడంలో పోటీలు ప్రారంభించాం. సాంప్రదాయ ఆహార పోటీలను కూడా నిర్వహించా,. దేశంలోని పలు ప్రాంతాలలో గ్రామీణ పిల్లలలో అనూహ్యమైన సృజనాత్మకత, అపార జ్ఞాన సంపద కనిపించాయి. కాని, ఈ పిల్లలు ఎప్పుడూ దూర ప్రాంతాలకు వెళ్ళేవారు కాదు. ఇంగ్లీషు భాషలో ప్రావీణ్యత లోపం, ఇతర అనేక విషయాల పట్ల అవగాహనా లేమి వారిని, వారి భావాలను కొంతవరకు అణచి వేశాయని చెప్పవచ్చు. ఈ విషయంలో సృజనాత్మకత వారిని ఆదుకోలేదు. చిన్నారులకు చక్కని పరిశోధనాసక్తి, స్వంతంగా ఆలోచించే శక్తి ఉందా, ప్రపంచాన్ని మరో కోణంలో చూడగలిగిన దృక్పథం వారిలో ఉందా అన్న విషయాలను ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

కాని మేము ఇప్పటికీ ఈ ప్రపంచాన్ని మార్చాలనే ధ్యేయంతోనే ఉన్నాం. ఎన్.ఐ.ఎఫ్. స్థాపించిన తరువాత, పిల్లలలోని పరిశోధనాసక్తిని వెలికి తీసి, గుర్తించి, వారికి ప్రెసిడెన్షియల్ అవార్డులు, పెద్ద పెద్ద సభలలో బహుమతులు ఇచ్చి ప్రోత్సహించే విధానం ప్రవేశ పెట్టాం. కాని రాను రాను పాల్గొనే పిల్లల సంఖ్య తగ్గిపోతోంది. ఈ పరిస్థితుల్లో 'హనీబీ నెట్‌వర్క్' సృజనాత్మక శక్తి ఉన్న పిల్లలను గుర్తించే దిశలో కార్యక్రమాలు ముమ్మరం చేసింది. దీనికి 'ఇగ్నైట్-07' నాంది పలికింది.

కాలం గడిచేకొద్దీ పిల్లలు వేస్తున్న వివిధ ప్రశ్నలు, వాళ్ళు వ్యక్తం చేస్తున్న సందేహాలు చూసిన తర్వాత ఆ పిల్లల్లోని సృజనాత్మకతను, పరిశోధనాసక్తిని, నైపుణ్యాన్ని వెలికి తీయడానికి మరింత ప్రత్యేక శ్రద్ధ పెట్టాలనిపించింది. ఈ సందర్భంగా శోధయాత్రలో మేము కలుసుకున్న కొందరు పిల్లల గూర్చి వివరిస్తాము.

ఒకసారి రాజస్థాన్‌లోని ఆళ్వార్ శోధయాత్రలో ఒక పదవ తరగతి విద్యార్థి కేవలం 75 రకాల మొక్కలు, వాటి పేర్లు, ఉపయోగాలు సేకరించావేం అని అడిగాము. ఆ పిల్లవాడు దీనిని ఒక ఛాలెంజ్‌గా తీసుకొని రెండు రోజుల సమయం అడిగి మరిన్ని వివరాలు సేకరించాడు. 501 మొక్కల పేర్లు, వాటి వివరాలతో వచ్చాడు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని అరకు శోధయాత్రలో 'కోడిపుంజు వలస' గ్రామంలో తల్లిలేని ఒక ఎనిమిది సంవత్సరాల అమ్మాయి 'జ్యోతి'ని వాళ్ళ తాతగారు తీసుకు వచ్చారు. ఆ అమ్మాయి అందరికన్నా భిన్నంగా 25 రకాల కొత్త మొక్కలను సేకరించింది. ఆ అమ్మాయి అభిరుచి, ఉత్సాహ, ఆమెను ఉన్నత శిఖరాలకు తీసుకువెళతాయి. ఆమె కళ్ళలో, మనసులో ఒక చక్కని ఊహాచిత్రానికి రూపకల్పన చేశాయి. అలాగే కొంతమంది పిల్లలు మమ్ములను చాలా ఆసక్తికరమైన ప్రశ్నలు వేశారు. వారిలోని పరిణతికి మేము ఆశ్చర్యపోయాము.

బీహార్ రాష్ట్రం చంపారన్‌లో సాగిన మా 22వ శోధయాత్రలో ఒక పాఠశాలలో జరిగిన సమావేశంలో ఒక చిన్న రైతు కుమారుడు అడుగుతాడు "నాదగ్గర కొద్ది ఎరువు మాత్రమే ఉంది. దానిని మొత్తం పొలంలో ఎక్కడ వేయాలి" అని. ఈ ప్రశ్న సరైన వ్యవసాయానికి తగిన ప్రశ్న. మనకు ఆ పొలం సారవంతంమీద సరైన అవగాహన అలాగే చిన్న చిన్న ఖండాలుగా అనగా 10 మీ. పొడవు, 10 మీ. వెడల్పు గల మొక్కలుగా ఆ పొలాన్ని విభజించి, ఎక్కడ ఈ కొద్దిపాటి ఎరువు వేస్తామో అక్కడ ఎక్కువ ఫలితం ఉంటుంది అనేది తెలిసుండాలి. కంపోస్టు ఎరువు కొరత ఏర్పడి, ఆవుపేడ ఎక్కువగా పిడకలుగా ఉపయోగించునప్పుడు ఈ ప్రశ్నకు ఎంతో ప్రాముఖ్యత ఉంది.

పది సంవత్సరాల క్రితం గుజరాత్‌లోని మహిళా గ్రామ విద్యాపీఠ విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగిచేప్పుడు మరొక సూటియైన ప్రశ్న నాకు ఎదురయింది. వాళ్ళని ఒక ప్రశ్న అడగమన్నాను. బహుశా వాళ్ళు అడిగే ప్రశ్నకు నాకు సమాధానం తెలియదు అనుకున్నారు. నిజ జీవితంలో ఉపాధ్యాయులు కూడా అజ్ఞానులని, తప్పు చేయగలరని, ప్రశ్నలు అడగటం ఒక ఆటగా ఉండాలని ఈ ప్రక్రియ ఎవరికీ ఇబ్బందిగా, బరువుగా ఉండకూడదన్నదే ఈ ప్రయోగానికి ఉద్దేశ్యం. ఒక ఆకతాయి అమ్మాయి అడిగింది "చక్కెర చిన్న ఎర్రచీమలను, బెల్లం పెద్ద నల్ల చీమలను ఎందుకు ఆకర్షిస్తాయి?" అని. నేను కొంతసేపు భ్రమకు లోనయ్యాను. ఆమె ప్రశ్న చీమ ప్రవర్తనకు సంబంధించినది. వాటి వాసనలను బట్టి రకరకాల చీమలు రక రకాల తీపికి అకర్షితులు కావచ్చు.

అలాగే కొందరు చుట్టూ కూర్చొని చూడటానికి అనువైన టి.వి. డిజైన్ ఏది అని అడిగినప్పుడు చతురస్రాకార టి.వి. నాలుగు భాగాలు గల టి.వి. అని సమాధానం సాధారణంగా ఇళ్ళలోగాని, సభలు, సమావేశాల లో గాని అందరు ముందు కూర్చొని ఒకే తెరవైపు చూడటం కాకుండా వృత్తాకారంలో చుట్టూ కూర్చొని టి.వి. చూసే విధానం అంత కష్టం కాదు అని భావిస్తారు పిల్లలు.

అలా తమ సృజనాత్మకత ప్రశ్నలకు సమాధానాలు రాబట్టుకున్న చిన్నారులు పదులు, వందలు కాదు వేల సంఖ్యలో ఉన్నారు. ఈ పిల్లల ప్రత్యేకత ఏమిటి? వారి సృజనాత్మకతను మనం ఆస్వాదించగలమా? పోషించగలమా? అదీ ఒక క్రమ పద్ధతిలో!

మన భారతదేశంలోని పాఠశాల విద్యా విధానంలో మార్పులు చేపట్టి పిల్లలు ఊహాజనితమైన చిలిపి ప్రశ్నలు వేసి ఒక మార్గదర్శకులుగా భావి తరాలలో తయారయ్యేట్లు ఎందుకు చేయకూడదు? తల్లిదండ్రులనుండి కూడా మార్కులు, ర్యాంకులకే వత్తిడి తగ్గించలేమా? అలాగే జమ్మూ కాశ్మీర్ లోని అనంతనాగ్ శోధయాత్రలో ఫారిద్ అడిగిన ప్రశ్న "అన్నింటిలో ప్రతిభ కనబరచాలి అనుకుంటారు కొందరు. నేను లెక్కలు, సైన్సు మాత్రమే చదువుకుంటాను అంటే ఎందుకు అంగీకరించరు?" ఈ ప్రశ్నలకు పాఠశాలలు, నేటి విద్యా విధానం సమాధానం చెప్పగలవా?

మనందరం ఇలాంటి ప్రశ్నలు మనకు మనం వేసుకొని రూపకర్తలపై వత్తిడి తీసుకు వచ్చి నేటి విద్యా విధానం సమూల మార్పులకు శ్రీకారం చుట్టాలి. చిన్నారులు ఎలా ఉండాలో అలా ఉండనిద్దాం! ఎలా పెరగాలో అలా పెరగనిద్దాం. వారి సహజ సిద్ధమైన ఉత్సుకతను, క్రియాశీలతను కాపాడుదాం.



# శతాధిక వృద్ధురాలు పూరిబెన్

110 సంవత్సరాల వయస్సులో కూడా 'పూరిబెన్' ఇప్పటికీ తన ఉత్సాహం, చురుకుదనంతో అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. బెన్ అంటే 'అక్క' అని అర్థం. గుజరాత్‌లోని బానస్కంత జిల్లా, అమిర్‌గర్ తాలూకాలోని ధామ్‌పురా గ్రామానికి చెందిన ఈమె ఇప్పటికీ సూదిలో దారం ఎక్కించగలదు! ఇంతవరకు పూరిబెన్ ఆసుపత్రి ముఖం కూడా చూడలేదు!!

ధనపురా గ్రామంలో సరోత్ర రైల్వే క్రాసింగ్ వద్దగల ప్రభుత్వ క్వార్టర్లలో జన్మించింది. తల్లి గృహిణి కాగా తండ్రి బ్రిటీష్ ప్రభుత్వంలో రైల్వే ఉద్యోగం చేసేవారు. ఇప్పటికీ చెల్లెళ్ళతో చిల్లంగోడి, బొమ్మలతో ఆడుకోవటం గుర్తే ఆమెకు. 10 సంవత్సరాల లేత ప్రాయంలోనే పొలం పనులలో సహాయం చేయటం, గొర్లని కాయటం మొదలు పెట్టింది. ఎడ్లని శుభ్రపరచటం, విసరటం లాంటి కష్టమైన పనులు ఆమెను మరింత బలిష్టంగా చేశాయి. ఉన్న ఊళ్ళోనే పెళ్ళి చేయటంలో ఆమె పుట్టినిల్లు, మెట్టినిల్లు ఒకే ఊరయింది. ఆమెకు ఇద్దరు కూతుళ్ళు, ఒక కుమారుడు ఉన్నారు. ఆమె ఇంటి ప్రాంగణమంతా జానపద పాటలతో, లాలిపాటలతో మారుమ్రోగేది.

**సాంప్రదాయ పశువైద్యం :**

ఆమెకి 15 సంవత్సరాల వయసుండగానే తన ఇంట్లో పశువులకి 'గాలికుంటు' వ్యాధి వచ్చింది. ఆమె అమ్మమ్మ దానికి చికిత్స చేయటం నేర్పింది. 250 గ్రా. జొన్నపిండి, 150 గ్రా. ఆవుపాలు కలిపి పశువుల గిట్టలకు నాలుగు రోజులు పూయించింది. అలా చేస్తే పశువులకు త్వరగా గాలికుంటు వ్యాధి నయమైంది. ఇప్పటికీ ఎన్నో రకాల ఇంగ్లీషు మందులు దొరుకుతున్నప్పటికీ ఆమె ఇదే వైద్యాన్ని అమలు చేస్తోంది.

పశువులు 'ఎద' కావటానికి సిద్ధం కాకపోతే ఆమె 5 కిలోల ఎండిన చెవులకాయలు (మట్టికాయలు) బాగా దంచి దానిలో 5 కిలోల జొన్న పిండితో చేసిన జావను కలిపి రోజూ రెండు కిలోల చొప్పున అయిదు రోజులు తినిపిస్తుంది. ఒకవేళ పశువు ప్రసవ వేదన పడుతుంటే 3 కిలోల సజ్జలు తీసుకుని వాటిని ఉడకబెట్టి దానిలో కొంత బెల్లం కలిపి తినిపిస్తుంది. అప్పటికీ అది ప్రసవించకపోతే ఆమె తన చేత్తోనే దూడను బయటికి తీస్తుంది. చేతిని శుద్ధి చేసుకోవడానికి ఉల్లిపాయల రసం వాడుతుంది. ఇలా ప్రతి యేటా జరుగుతుంటే దానికి చికిత్సగా బియ్యం పిండి, మినుప పిండి, మెంతుల పొడి కలిపి పశువు ప్రసవానికి ముందు 15 రోజులు తినిపిస్తుంది. ఇలా చేస్తే సులభ ప్రసవం జరుగుతుంది.

**స్త్రీలకు కూడా వైద్యం :**

పూరిబెన్ స్త్రీలకు కూడా ప్రసవ సమయంలో ఎంతో సహాయకారిగా వుంటుంది. ఈమె ఇప్పటికి దాదాపు 1200 మందికి ప్రసవాలు చేసింది. గర్భిణీ స్త్రీ ప్రసవ వేదనతో బాధపడుతున్న వారికి తుమ్మ ఆకును, మేడిపండ్లను బాగా దంచి, మజ్జిగలో కలిపి ఆ మిశ్రమాన్ని స్నానం చేసే వేడి నీటిలో వేసి స్నానం చేయిస్తుంది. ఆ తర్వాత గర్భిణీని వేడి గదిలో విశ్రాంతి తీసుకోమంటుంది. తల్లికి పాల సమస్య వుంటే 50 గ్రా. సువా (సోంపు)ను, 50 గ్రా. శొంఠిని తినమంటుంది. పసి పిల్లలకి కడుపులో నొప్పి వస్తే శొంఠిని పాలలో మరిగించి తినిపిస్తుంది. తలనొప్పిగా వుంటే నిమ్మ ఆకులు, సోంపు, శొంఠిల కషాయాన్ని యిస్తుంది.

ఇలాంటి ఇంకెన్నో రోగాలను తన సంప్రదాయ వైద్యం ద్వారా నయం చేస్తూ వుంటుంది.

**సాత్వికమైన ఆహారం – జీవితం :**

ఆమె ఇన్ని సంవత్సరాలుగా ఆరోగ్యంగా ఉండటానికి కారణం చిన్నప్పటినుంచి సాత్విక ఆహారం తీసుకోవటమే. ఊరికే చిర్రుబుర్రులాడకుండా రోజంతా గడ్డి తేవటం, వ్యవసాయంలో సహాయం చేయటం లాంటి పనులు చేస్తుంది. చుట్టప్రక్కల చిన్న పిల్లలని చేరదీసి, వాళ్ళు ఆడుకుంటుంటే చూస్తూ గడపటం ఆమెకు అలవాటు.

**పూరిబెన్ సలహా :**

సాత్విక ఆహారం తినండి, కొట్లాటలు, కోప తాపాలు మాని, ఎప్పుడూ అందరి కలిసి ఉండండి, ఎప్పుడూ పనికివచ్చే పనులనే చేయండి. అనవసర పనులు చేయకండి అని సలహానిస్తుంది. ●

పూరిబెన్‌లాగా మన గ్రామాల్లో 90 ఏళ్ళ వృద్ధులు ఉంటారు. వారితో కబుర్లలోకి దిగండి భవిష్యత్ తరానికి కావలసిన ఎన్నో విషయాలు వాళ్ళ జ్ఞాపకాల్లో నిక్షిప్తమై ఉంటాయి. వారిని గురించి తెలుసుకుని వారి కథ మాకు వ్రాస్తే పత్రికలో ప్రచురిస్తాం.

– ఎడిటర్

# గ్రామ జ్ఞానంతో విద్యార్థుల అనుబంధం : జ్ఞానశోధ




హనీబీఏపి, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.)

**హనీబీఏపి "జ్ఞానశోధ" ప్రయోగంలో మా అనుభవాలను ఈ క్రింది నివేదికలో తెలియజేస్తున్నాము. 14 మందితో కూడిన మా బృందాన్ని 5 విభాగాలుగా విభజించి, వరంగల్ జిల్లాలోని తొర్రూరు, ములుగు మండలాల్లో పర్యటించాలని నిర్ణయించారు. ప్రతి బృందానికి ఒక గ్రామం లేదా తండా కేటాయించడం జరిగింది. ఆ బృందం ఆ గ్రామంలో మూడు రోజులుండి ఆ గ్రామానికి సంబంధించిన అన్ని వివరాలను సేకరించవలసి వుంటుంది. మా బృందానికి తొర్రూరు మండలంలోని హచ్చుతాండ, ములుగు మండలంలోని బుస్సాపూర్ గ్రామాలను కేటాయించారు. ఈ గ్రామాలకు 'బిట్స్, పిలాని' విద్యార్థులు టి. కళ్యాణ గౌతమ్, బి. బాలఫణిచంద్, రాకేష్‌లు పర్యటించి తమ అభిప్రాయాలను వెలిబుచ్చిన నివేదిక......**

హచ్చుతాండ – చరిత్ర :

స్థానిక లంబాడ భాషలో "తాండ" అంటే కొన్ని ఇళ్ళ సముదాయం. ఈ తాండాను కనుగొన్న "హచ్చు" పేరుమీదుగా దీనికి "హచ్చుతండ" అన్న పేరు వచ్చింది. చింతలపల్లి సమీపంలో నెలకొన్న ఈ హచ్చుతండ లంబాడీల స్థిరనివాసము. ఇది వరంగల్ జిల్లా, తొర్రూరుమండలంలో ఉంది. ఇక్కడి వారందరూ సూర్యాపేటనుంచి వల్లేడు, అంబాపురం లాంటి ఇతర ప్రాంతాలకు అక్కడినుండి చింతలపల్లికి వలస వచ్చినవారే.

ప్రారంభంలో ఈ తండాలో రెండు గుగులోత్, రెండు బాణోత్ కుటుంబాలు మాత్రమే నివసిస్తూ ఉండేవి. రెండు అర్థ భాగాలలో నివసిస్తున్న ఈ రెండు కుటుంబాలలో తండాలోని ఒక రోడ్డు విభజిస్తూ ఉంటుంది. (ఇది తప్పనిసరిగా అవసరమైనది కాదు) ఇటీవల ఈ తండాలోకి క్రొత్తగా ధరావతు కుటుంబం ప్రవేశించింది. ఇక్కడి స్థానికులు లంబాడ కుటుంబాలు, షెడ్యూల్డు తెగకు చెందినవారు. తమ పూర్వీకులు బందరు (మచిలీపట్నం) నుండి హైదరాబాద్‌కు 'ఉప్పు' అమ్మి జీవనోపాధి సాగించేవారని పేర్కొన్నారు.

**వ్యవసాయము – ఆహారము :**

చాలా కాలంనుండి వీరి ప్రధాన వృత్తి వ్యవసాయం. ఈ ప్రాంతంలో భూగర్భ జల వనరులు అంతగా లేకపోవడంతో తమ పూర్వీకులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనే వారని, దూర ప్రాంతాలనుంచి తోలు

తిత్తులతో నీటిని రవాణా చేసుకోవలసి వచ్చేదని, అందుచేత జొన్నలు, మొక్క జొన్నలు, రాగులు, సొద్దలు లాంటి తక్కువ నీటి అవసరంగల పంటలు పండించేవారు. వారి ప్రధాన ఆహారం అత్యంత పోషక విలువలు కలిగిన గటక. బహుశా వీరి పూర్వీకులు ఎక్కువ కాలం బ్రతకడానికి ఈ ఆహారపు అలవాటే ప్రధాన కారణం కావచ్చు. వారి ఆహారంలో మరొక ప్రధాన పదార్థం ఎక్కువ పోషక విలువలు కలిగి, ఈ రోజులలో సులభంగా లభ్యం కాని, 'బత్తాకు'. వారు పళ్ళు బొగ్గుపొడితో తోముకునేవారు. ఈ రోజులలో కూడా వారి పాల వినియోగం చాలా తక్కువ. ఎక్కువ భాగం పాలను దూడలకే వదిలేస్తారు. వారిలో ఎక్కువ శాతం మంది వేసవిలో పెరుగుకు బదులుగా తాటికల్లు సేవించేవారు. అంతేకాదు వేసవిలో ఈ ప్రాంతంలో కాయగూరలు సాగు ఆశించినంత లేకపోవడంతో ఆహారంలో ఎక్కువ పప్పు, ఊరగాయలమీదనే ఆధారపడతారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా మూడు రకాల నేలలు కన్పిస్తాయి. అవి ఎర్రమట్టి నేలలు, నల్లరేగడి నేలలు, చవుడు భూములు. నీళ్ళు పుష్కలంగా లభించే చోట వరి పండిస్తారు. ఇతరచోట్ల ప్రత్తి, వేరుశెనగ, పసుపు, మిర్చి, పెసలు, కందులు, ఆముదాలు, శెనగలు, నువ్వులు లాంటి పంటలు పండిస్తారు. వారు పండించే బియ్యంలోని రకాలు సోనా మసూరి (బిపిటి), 1001, 1000, ఎర్రమల్లి, జేజేలు. ఈ ప్రాంతంలో విస్తారంగా పండించే పంట వేరుశెనగ.

**ఆరోగ్యం :**

గతంలో వారి ఆహారపు అలవాట్లు, పని విధానాల మూలంగా కాబోలు మనుషులు, పశువులు కూడా కొన్ని వాధులతో బాధపడేవి. ఏవేని వ్యాధులు సోకినపుడు వారు ఎక్కువగా ఆకులు, పసర్లు ఉపయోగించే వారు. అలాగే గ్రామ దేవతలైన ముత్యాలమ్మ ఆశీస్సులతో మంత్రాలు వేయించుకునేవారు. ఇందుకే వారు ఉపయోగించే చెట్ల పేర్లు వెల్లడించినట్లయితే వాటి శక్తి నశిస్తుందని, అవి పనిచేయవని వారిలో కొంతమంది నమ్మకం. కాని కొంతమంది అలాంటి వివరాలు వెల్లడించడానికి ఏమాత్రం వెనుకాడలేదు. ఆ గ్రామంలో అతిపెద్ద వయసువారు తెలిపిన ప్రకారం మందులుగా పనిచేసే మొక్కలు సుమారు 33 రకాలు ఉన్నాయి. అతనికి గుర్తున్నంత వరకు ఆ మొక్కలు నల్లగురివి, తంగేడు, నాలతాటి, నల్ల ఉసిరి, సిబ్బితీగ, మురుదుండగడ్డ. కాని ఈ మొక్కలు తమ ప్రాంతంలో చాలా అరుదుగా లభ్యమవుతాయి అని పేర్కొన్నారు. ఇవి సాధారణంగా అడవులలో లభ్యమవు తాయి. ఈ విషయంలో విషయ సేకరణకు 'బయోడైవర్సిటీ' పోటీలు ఎంతగా నో ఉపకరిస్తాయి అని నిరూపించబడింది. ప్రతిచోట పిల్లలు విషయ సేకరణలో మాకు ఎక్కువ దోహద పడ్డారు. ప్రధాన పాత్ర పోషించారు. సేకరించిన సమాచారం ఈ క్రింది విధంగా ఉంది.

**జమ్మిచెట్టు :**

జమ్మిచెట్టు ఆకులు నీళ్ళలో ఉడికించి కాళ్ళ వాపు ఉన్నచోట కడితే బాగా పనిచేస్తుంది. అలాగే ఈ నీటితో స్నానం చేస్తే జ్వరం తగ్గిపోతుంది.

**గోరింటాకు :**

గోరిటాకు నూరి ఆ ముద్దను చిన్న చిన్న గాయాలకు కట్టినట్లయితే చక్కటి ఫలితం కన్పిస్తుంది. దీనికి క్రిమి సంహారక (యాంటీ సెప్టిక్) లక్షణాలు ఎక్కువగా ఉన్నాయని విశ్వసిస్తారు.

**వాము చెట్టు :**

జ్వరంతో బాధపడుతున్నప్పుడు వాము చెట్టు ఆకులను వెచ్చని నీళ్ళలో వేసుకొని స్నానం చేస్తే ఫలితం కన్పిస్తుంది.

**వేపచెట్టు :**

దీని పండ్లు, ఆకులు అనేక మందులలో ఉపయోగిస్తారు. దీని పండ్లను నీళ్ళలో నానబెట్టి క్రిమి సంహారిణిగా, మురికిని పోగొట్టేదిగా పనిచేస్తుంది.

**నవినార చెట్టు :**

ఈ చెట్టు పట్టను వలిచి నీళ్ళలో ఉడికించి, కాళ్ళ వాపుకు కడితే తగ్గుతుంది.

**ముద్ద మందార చెట్టు :**

దీని ఆకులు నూరి తలకు పట్టిస్తే జుట్టు రాలడం తగ్గుతుంది. అలాగే జుట్టు నల్లబడుతుంది.



**సంస్కృతి :**

వీరు జరుపుకునే ప్రధాన పండుగ 'టీజ్'. ఈ పండుగను వీరు 9 రోజుల పాటు జరుపుకుంటారు. గ్రామస్తులందరూ ఈ పండుగ వేడుకలలో పాల్గొని మేకలను దేవతకు బలి ఇస్తారు. లంబాడీలలో వివాహాలు చాలా వైభవంగా, గొప్పగా జరుగు తుంటాయి. గతంలో ఈ వివాహ ప్రక్రియ మూడు నెలలు ముందుగా మొదలై వివాహానం తరం మూడు నెలల వరకు కొనసా గేది. ఈ కాలం మొత్తం పెండ్లికుమారుడు అత్తగారి ఇంట్లోనే ఉండేవాడు. కాని ప్రస్తుతం ఈ వివాహ తంతు కేవలం గరిష్టంగా రెండు రోజులకు మించి జరగడం లేదు.

హచ్చుతాండ వాసుల మూలమైన జీవన స్థితికి అలవాటు పడ్డారు. ఇక్కడి ప్రజలు ప్రకృతితో సన్నిహితంగా జీవనం సాగిస్తుంటారు. ఈ తండా తొర్రూరుకు దూరంగా ఉండటంతో ఇప్పటికీ పట్టణ వాతావరణం, నగర సంస్కృతిని అలవరచు కోలేదు. హచ్చుతాండ, దుబ్బతాండ వాసుల సంస్కృతి సాంప్రదాయాలు, జీవన విధానం చూసినట్లయితే భౌగోళిక పరిస్థితుల ప్రభావం వీటిపై ఎంతగా వుంటుందో, వీటిని ఎంతగా నిర్వీర్యం చేస్తుందో అర్థమవుతుంది. ఈ ప్రాంత వాసులను ఎక్కువగా పీడిస్తున్నది త్రాగునీటి సమస్య. ఈ సమస్యల గూర్చి మనం విచారించేటప్పుడు ఒక్కసారి తీవ్ర నిరసనలు ఎదుర్కోవలసి వస్తుంది. మరో సమస్య వర్షాకాలంలో ఎక్కడి నీరు అక్కడ నిలిచిపోయి తీవ్ర అనారోగ్యకర వాతావరణా నికి దారి తీస్తుంది. ఈ కాలంలో ఇక్కడి వారు తీవ్ర అనారోగ్యాలకు గురవుతుంటారు. వారు ఒక రకంగా ఈ కాలాల మార్పునకు అలవాటు పడ్డట్టుగా అన్పిస్తుంది. లంబాడీలది అత్యున్నతమైన సంస్కృతి. కాని ఈ విషయం వారిలోనే చాలామందికి తెలియదు. ఉదాహరణకు వారి వివాహ వ్యవస్థ, వారి పండుగలు ఇతరులకు భిన్నంగా ఉంటాయి. ఇలాంటి సంస్కృతి సాంప్రదాయాల గూర్చి పెద్దలు మాట్లాడుతుంటే పిల్లలు ఎంతో ఆసక్తిగా వింటారు. దీన్ని బట్టి అక్కడి పిల్లలు, యువతకు సంస్కృతి సాంప్రదాయాలను, మూలాలను తెలుసుకోవాలి అన్న తపన ఉన్నట్టుగా తోస్తుంది. కాని తరచూ ఇలాంటి సమావేశాలు నిర్వహించడం జరగదు. బహుశా మా ముందు జరిగిన జ్ఞాన చర్చ మరెప్పుడూ ఆ గ్రామంలో జరగలేదేమో!

**బుస్సాపూర్ :**

ములుగు మండలంలో రత్నవరం చెరువు వద్ద ఉన్న గ్రామం 'బుస్సాపూర్'. ఆ గ్రామంలో కూలీగా పనిచేసే 90 సంవత్సరాల వృద్ధుడు సయ్యద్ నిజామ్ ఆలి మాటల ప్రకారం అప్పటి ఛైర్మన్ జహారా ముద్దీన్ గారు ఈ గ్రామానికి బుస్సాపూర్ అని పేరు పెట్టారు.

ఈ గ్రామంలో భిన్న కులాల వారు ఐకమత్యంగా నివశిస్తూ జాతి, కుల, మత సామరస్యానికి అతీతంగా ఈ గ్రామాన్ని పేర్కొంటారు. ఈ గ్రామంలో ఎక్కువ శాతం ముస్లింలు దినసరి కూలీలుగా జీవనం సాగిస్తూ ఉంటారు. వీరిలో చాలామందికి ఎలాంటి భూములు లేవు. కొంతమందికి ఏదో కొద్ది పాటి భూమి ఉండవచ్చు. ఈ గ్రామంలో నివసించే ఇతర ప్రధాన కులాల వారు రెడ్డి, గౌడ, గొల్ల, బోయ, కోయ మొదలగు కులాలకు చెందినవారు. ఈ గ్రామం అడవికి దగ్గరగా ఉండటంతో కాలక్రమేణా ఎక్కువ భాగం అడవిని నరికి భూములను స్వాధీనం చేసుకున్నారు. బుస్సాపూర్ నుండి లక్కవరం పోయే దారి పొడవున రోడ్డుకు ఇరువైపుల అడవులను నరికి భూములను స్వాధీనం చేసుకున్న వైనం మనకు కనిపిస్తుంది. ఈ గ్రామంలో చాలామంది గతంలో ఎలాంటి భూమిలేక ఇతరులకు కూలీలుగా పనిచేసిన వారే. 80వ దశకంలో ప్రభుత్వం వీరికి భూములు పంచడం జరిగింది. ప్రస్తుతం వీరు క్రొత్త భూములకు పట్టాలు ఇవ్వవలసిందిగా ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు.

ఈ గ్రామంలో ఎప్పుడూ నీటికి ఎలాంటి కొరత లేదు. దీనికి ప్రధాన కారణం ఇక్కడ వర్షాలు విస్తారంగా పడుతూ ఉండటమే కాక, వర్షనీటిని నిల్వ ఉంచుకునేందుకు అనువుగా సుమారు 10 వేల ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న లక్కవరం చెరువు. ఈ చెరువు పచ్చని అడవులతో కూడిన 13 దీవులతో కనువిందు చేస్తూ ఉంటుంది. ఇటీవలే మన పర్యాటక శాఖ ఇక్కడి మూడు దీవులను కలుపుతూ ఒక వేలాడే వంతెనను నిర్మించింది. దీంతో ఈ ప్రాంతంలో ఇది ఒక ముఖ్యమైన పర్యటక కేంద్రంగా రూపు దిద్దుకుంది. ఈ ప్రాంతాన్ని ఒక సంపూర్ణమైన పర్యాటక కేంద్రంగా రూపు దిద్దుకునేలా చేయడానికి ప్రభుత్వం విస్తృత ప్రణాళికలు తయారు చేస్తోంది. కాని, స్థానిక సమాచారం ప్రకారం ఈ ప్రాజెక్టు క్షేత్ర స్థాయి ప్రణాళికతో ముందుకు సాగడం లేదు. ఈ పథకానికి నిర్దేశించిన మొత్తాలను స్థానిక శాఖలు, అధికారులు సకాలంలో విడుదల చేయడం లేదు. ఈ దీవులపై కాటేజీలు, యోగశాలలు, రెస్టారెంట్లు, చిన్నపాటి జంతు ప్రదర్శన శాలలు మొదలైనవి ఏర్పాటు చేయాలని పర్యాటక శాఖ ప్రణాళికలు రూపొందించింది. పర్యాటకులను ఇక్కడ విశేషంగా ఆకర్షించే మరొక ప్రధాన అంశం బుస్సాపూర్‌లో కాకతీయులు నిర్మించిన ఆలయం. ఇటీవల ఎ.ఎస్.ఐ. వారు ఈ ఆలయాన్ని పునరుద్ధరించడం జరిగింది. ఇప్పుడు ఈ వంతెనను సందర్శించే పర్యాటకులకు ఇక్కడ ఇది ఒక ప్రధాన ఆకర్షణ.

ఈ ఆలయ ప్రత్యేకత – ఇక్కడ ఒకే ఆలయంలో శివుడు, విష్ణువు దర్శనమిస్తారు. అంతేకాక, ఈ ఆలయంలో సాంఘికంగా ఆమోదయోగ్యం కాని శృంగార భంగిమలను తెలియజేసే అసంపూర్తిగా మిగిలిన చిత్రాలు దర్శనమిస్తాయి. కాని, ఆ గ్రామంలోని పెద్దలు మాత్రం ఇలాంటి అభివృద్ధి పరోక్షంగా సంస్కృతీ, సాంప్రదాయాలకు తీవ్ర విఘాతం కల్గిస్తోందని తద్వారా నీతి, నిజాయితీ, నైతిక విలువల పతనానికి దారి తీస్తోందని

అంటారు. దీనిని మరో కోణంలో చూచినట్లయితే ఈ అభివృద్ధి మూలంగా అనేక పరిసరాల గ్రామ ప్రజలకు ఉపాధి అవకాశాలు దొరుకుతున్నాయి. ఇప్పటికే ఈ పర్యాటక ప్రభావం ఈ గ్రామంపై చెప్పుకోతగ్గంతగా ఉన్నదని మా వ్యక్తిగత అభిప్రాయం.

వీరి పూర్వీకుల విజ్ఞాన వారసత్వం సంపద చాలావరకు కనుమరుగవుతున్నదని చెప్పవచ్చు. అంతే కాక ఈ బుస్సాపూర్ వాసులు పూర్తిగా వ్యాపార దృక్పథంగా మారిపోయారు. బహుశా ఏ పర్యాటక ప్రాంతానికైనా ఈ స్థితి తప్పదేమో.

ఈ ప్రాంతంలో ప్రభుత్వ ఉపాధి హామీ పథకం అంత సమర్థవంతంగా పనిచేస్తున్నట్లు లేదు. కొందరు రైతులతో మాకు జరిగిన సంభాషణలో అర్థమైందేమిటంటే, చాలామంది ఎలాంటి పని చేయకుండా కవలం సంతకం చేసి దినసరి వేతనం తీసుకుంటూ ఈ పథకాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. అంతేకాక మరికొంతమంది ధృవీకరించినట్లు ఇక్కడ పెద్దగా పనులు లేకపోవడం మూలంగా ఇలాంటివి జరుగుతున్నాయి. ఈ గ్రామానికి అతిపెద్ద త్రాగునీటి వనరు కాలాలతో సంబంధం లేకుండా నిరంతరం నీటి ఊటను అందిస్తున్న ఒక చిన్న 'చెలిమ' మాత్రమే కేవలం రెండు అడుగుల వ్యాసార్థం గల ఒక చిన్న గుంట ఆ గ్రామం మొత్తానికి సరిపడ త్రాగేనీటి అవసరాలను తీరుస్తోంది. అంటే ఆశ్చర్యమే మరి. ఈ నీటిని ప్రభుత్వం వారు కూడా పరీక్షించి ఎలాంటి మలినాలు లేని త్రాగడానికి అర్హమైన 'మినరల్ వాటర్'గా పేర్కొన్నారు.

ఇక్కడి వివాహాలు సాధారణ పద్ధతులలోనే జరుగుతాయి. పెండ్లి ఊరేగింపులలో హిందువులు పల్లకిని, ముస్లింలు గుర్రాలను ఉపయోగిస్తారు.

కొందరు కల్లుగీత కార్మికులతో మాకు జరిగిన సంభాషణ మూలంగా కల్లుగీత వ్యాపార విషయంలో మాకు ఒకింత పూర్తి అవగాహన కల్గింది. కల్లు వివిధ రకాల ఫామ్ చెట్ల నుండి గీస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో మనకు లభ్యమయ్యే రెండు రకాల పామ్ చెట్లు ఒకటి 'తాటి' మరోటి 'ఈత'. ఈ రెండు రకాల చెట్లనుండి కలుజ్ల గీస్తారు. కాని తాటికల్లుకు ఎక్కువ గిరాకి ఉంటుంది. ఇది చెట్టు రకం, వయస్సును బట్టి రోజుకు 2-3 సార్లు గీస్తారు. చక్కని రుచికోసం కల్లు గీయగానే తాగితే బాగుంటుంది. అంతేకాక ఈ కల్లును 12 గంటల పాటు నిల్వ ఉంచినట్లయితే 'ఆల్కహాలు' మోతాదు పెరిగి పులుస్తుంది. సుమారు ఒక లీటరు కల్లు ఉన్న కుండ 10 రూపాయలకు అమ్ముతారు. ఈ ప్రాంతమంతా దీని ఖరీదు ఒకటిగానే వుంటుంది. ఆ గ్రామంలో ఉన్న గౌడ కులస్తులు అందరూ అక్కడ ఉన్న తాటి చెట్లను అన్నింటిని సమానంగా పంచుకొని కల్లు గీస్తారు. పద్దాడ, పరుపుద్దాడ మరియు ఏంటదాడ అని తాటి చెట్లు మూడు రకాలు. పద్దాడ రకం చెట్లను కేవలం తాటి ముంజలకు, మిగిలిన రెండు రకాల చెట్లను కల్లు గీయటానికి ఉపయోగిస్తారు. చెట్టు చుట్టూ చీమలు చేరి చెట్టు ఎక్కేటప్పుడు ఇబ్బంది కలిగించకుండా తాటి చెట్టు చుట్టూ జీడి అనే ఒక విధమైన లేపనాన్ని పూస్తారు. ఈ లేపనాన్ని తయారు చేయడానికి జీర్ణించిన కుండను రంధ్రం చేసి, దానిలో జీడి గింజలు వేసి వాటిని కాలుస్తూ చెట్టు చుట్టూ పొగ పెట్టడం ద్వారా చెట్టుకు క్రిందినుంచి పై వరకు ఈ లేపనం అంటుతుంది. కాని ఈ రోజుల్లో తక్కువ ఖరీదుతో లభించే ట్రాక్టర్లలో ఉపయోగించే ఇంజన్ ఆయిల్ మడ్డిని ఈ పనికి ఉపయోగిస్తున్నారు. ఈ పద్ధతి వల్లే 'మోగి పురుగు' అన్న వినాశకర పురుగు ఈమధ్య వచ్చిందని కొందరు భావిస్తున్నారు. 'మోగి పురుగు' అనే ఒక జాతి పురుగు తాటి గెలలను మొత్తం తినేసి ఆ చెట్టు ఎందుకూ ఉపయోగించకుండా చేసేవి. ఈ మార్పు మూలంగా అవి పూర్తిగా నశించడం జరుగుతోంది. అంతే కాక త్వరితగతిని ఈ పురుగు ఆ ప్రాంతంలోని ఒక చెట్టు నుండి మరొక చెట్టుకు వ్యాపిస్తుంది. ఆ పరిస్థితుల్లో ఈ పురుగు సోకిన చెట్టును నరికి కాల్చేసేవారు.



ఆ గ్రామంలోని ఒక పెద్ద వృద్ధుడు తన తరానికి చెందిన కొన్ని మూలికా ఔషధాలను ఇచ్చాడు. అతను కొన్ని మూలికల పేర్లను మాత్రమే గుర్తు చేసుకోగలిగాడు. కాని వాటి ఉపయోగాలు గుర్తు లేకపోయాయి. అవి నల్లుప్పి చెట్టు, నేలకొర్రి, మచ్చెతునక, స్వప్పారి, నాగముష్టి, నేలకొర్రి మాత్రం ప్రఖ్యాతంగా చాల రకాల వ్యాధులకు ఉపయోగిస్తారు. నల్లమామిడి చెట్టు పట్టను దంచి లేపనంగా తయారు చేసి విరిగిన ఎముకలకు కట్టు కడితే బాగా పనిచేస్తుంది. ●

స్పందన

# 'పల్లెసృజన'కు స్వాగతం



"ఇన్నోవేషన్" అనగా సరిక్రొత్త విషయాన్ని "అన్వేషణ" (కనుగొనుట) చేయడం మరియు దాని ఆవిర్భావం సమాజానికి మేలు చేయడం. ఇలా చేసేవారిని "ఇన్నోవేటర్స్" అంటారు.

ఈ సృష్టిలోని ప్రాణులన్నింటిలో మానవునికి భగవ,తుడు అపారమైన మేధస్సును ప్రసాదించాడు. మన పూర్వీకులు కనుగొన్న విజ్ఞాన, సాంకేతిక, ఆహార, ఆరోగ్య, సాంప్రదాయక కట్టుబాట్ల ద్వారా మనం ఈనాడు సౌకర్యవంతంగా జీవించగలుగుతున్నాము. మనము కూడా మన చుట్టూ ఉన్న పరిస్థితులను గమనిస్తూ ఉంటే, ఏదో ఒక విషయంలో సమాజానికి ఉపయోగపడే ఆలోచన తప్పకుండా స్ఫురిస్తుంది. ఆ ఆలోచనను విశ్లేషించి, సాధ్యాసాధ్యాలను బేరీజు వేసి, కార్యరూపం కావించి, ప్రయోగాత్మకంగా నిరూపించగలిగితే ఒక క్రొత్త ప్రక్రియకు 'ఆవిర్భావం' జరుగుతుంది. అది మన ద్వారాగాని, మనం ప్రేరేపించి, ప్రోత్సహించిన వారి ద్వారాగాని జరగవచ్చు.

ప్రతి ఒక్కరు తమ జీవితంలో కొంత సమయాన్ని కేటాయిస్తే మన రాష్ట్రం తద్వారా దేశం, ప్రపంచం, భావితరాలు అన్నీ కూడా విజ్ఞాన గనులౌతాయి.

సామాన్య మానవునిగా జీవించడం భగవంతుడు ఇచ్చిన అనుగ్రహంగా భావించాలి. ఎందుకంటే సమాజంలో నిజమైన పాత్ర పోషించ గలిగేది సామాన్య మానవుడు మాత్రమే. మిగతా వారికి కొన్ని పరిధులు ఉంటాయి. తద్వారా వారు జీవితపు స్వేచ్ఛను కోల్పోతారు. సామాన్య మానవునికి అవసరాలు, అనుభవాలు, స్వేచ్ఛ, అవగాహన అన్నీ కూడా ఎక్కువే. నిజమైన సామాజిక అవసరాలు తెలిసినవాడు సామాన్య మానవుడు. ఈ అవసరాలు తీరడానికి ప్రత్యామ్నాయం కనిపెట్టగలిగితే అసామాన్యుడవుతాడు.

గొప్పవారి చరిత్రలు తిరగేస్తే వారు కూడా ఒకప్పుడు అతి సామాన్యులుగా గుర్తించవచ్చు. ఎంతో శ్రమకోర్చి, అవమానాలను భరిస్తూ, తమను తామే ప్రేరేపించుకుంటూ, నిరంతరం శ్రమిస్తూ, ప్రతిభను కనబరుస్తూ ముందుకు సాగినవారే చరిత్ర పుటల్లో స్థానం సంపాదించగలిగారు. సమాజానికి ఉపయోగపడే ఎక్కువ ఆవిష్కరణలు వీరి ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని చరిత్రలో ఋజువైన సంఘటనలెన్నో!

"కోతినుండి పుట్టాడు మానవుడు" అని పెద్దలు అంటారు. కోతుల ఆవాసం అడవులు. అడవులు ప్రకృతికి చిహ్నాలు. మంచి గాలి, మంచి వాతావరణం, సులభంగా జీర్ణించుకోగలిగిన ఆహారం, ఔషధాలు మొదలైన వాటికి పుట్టినిల్లు అడవులు. ఈ అడవులకు అనుసంధానమైనవే పల్లెసీమలు. మానవుడు జీవించడానికి కావలసిన ఆహారాన్ని అందించేవి పల్లెలు. ఈ పల్లెవాసులే మన కంటికి కనిపించే అపరబ్రహ్మలు. ఇక్కడే సాంప్రదాయ విజ్ఞానానికి పునాదులు ఏర్పడ్డాయి. పెద్ద ఆవిష్కరణలకు మూలాలు ఇక్కడే ఉన్నాయి. వాటిని వెలుగులోనికి తీసుకు రావలసిన బాధ్యత మనందరిమీద ఉంది. ఈ కార్యక్రమానికి వేదిక "పల్లెసృజన" అని ప్రతి ఒక్కరూ గుర్తించి, తమకు తెలిసిన సాంప్రదాయ విజ్ఞానాన్ని, ఆవిష్కరణలను, అన్వేషణలను కాగితంపై వ్రాసి పంపగలిగితే ఈ "పల్లెసృజన" కూడా ఒక గ్రంథమవుతుంది. అది భావితరాలకు వెలుగునిస్తుంది. ఆ కాంతికి మూలాలు మీరే అవుతారు.

"ఏదేశమేగినా ఎందు కాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని" అన్నట్లుగా ముందుగా మన దేశంలోని పల్లెసీమల గొప్ప తనాన్ని గుర్తించి, గౌరవించి, ప్రోత్సహిస్తే ప్రపంచ దేశాలముందు మన భారతదేశ విశిష్టతను చాటినట్లేనని ప్రతి భారతీయుడు గుర్తించాలి.

"గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక"కు అందరూ ఆహ్వానితులే! సుస్వాగతం!!

– **యం. బంగార్రాజు,** ఇన్నోవేటర్, శ్రీశైలం ప్రాజెక్ట్, కర్నూలు జిల్లా. ఫోన్ : 94411 93119

**పల్లె సృజన ఉద్దేశ్యాన్ని ఎంతో అందంగా వ్రాసిన మీకు మా కృతజ్ఞతలు. మీ ప్రాంతంలో దీన్ని ప్రాచుర్యం చేస్తారని ఆశిస్తున్నాం.**

– ఎడిటర్

ఎడిటర్ గారికి,

పల్లెసృజన ఆర్టికల్స్ చాలా బావున్నాయి. వీటిని గురించిన సమాచారం గురించి ఇంకా విచారించాలంటే ఎవరిని సంప్రదించాలో అర్థం కావడం లేదు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ ప్రచురిస్తే బాగుంటుంది.

– **రంగారెడ్డి,** ఇ.ఓ. (పి.ఆర్ & ఆర్.డి.), సీతాపురం, నెల్లూరు జిల్లా.

**మీ అభిమానానికి ధన్యవాదములు. ఈ పత్రిక మొదటి పేజీలో 'పల్లెసృజన'కు సంబంధించిన ఫోన్ నెంబర్లు అన్నీ ఉన్నాయి. అయినా మీ సలహాను స్వీకరించి ఈ సంచిక నుండి ప్రత్యేకంగా పత్రికలోని విషయాలను కూలంకషంగా చర్చించేందుకు అవసరమైన ఫోన్ నెంబర్లను ప్రచురిస్తున్నాము.** – ఎడిటర్.

## 'హనీబీఏపి' అంతరాత్మ

# పల్లె సృజన

'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' సంస్థ లక్ష్యాలను సాధించటానికి 'హనీబీ' (తేనెటీగ) అనే పేరుతో ఒక యంత్రాంగం రూపొందించబడింది. తేనేటీగ అత్యుత్తమ నిస్వార్థ ప్రాణి. పూలల్లో వున్న మకరందాన్ని ఆస్వాదించి, తన శ్రమతో దాన్ని తేనెగా తయారు చేసి మానవాళికి అందజేస్తుంది. మూవుకు నష్టం వాటిల్లకుండా, ప్రజానీకానికి లాభమయ్యేటట్లుగా చాకచక్యంతో కార్యాన్ని నిర్వర్తిస్తుంది. ఈ తేనెటీగ జీవన సరళియే ఉద్దేశ్యంగా 'హనీబీ' స్వచ్ఛంద సంస్థ మరుగున పడివున్న గ్రామీణ ప్రాంతాలలో సాంప్రదాయకంగా వాడే పద్ధతులు, సృజనాత్మక ఆలోచనలను వెలికి తీయడానికి కృషి చేస్తున్నది. ప్రజలనుండి మనం ఏదైనా జ్ఞానాన్ని సేకరించినపుడు, వారు గరీబులుగా మారకూడదు. వారి అంతరాంతరాల్లోని ఆలోచనల్ని మనతో పాలు పంచుకొన్నప్పుడు వారికి అంతో ఇంతో లాభం జరగడం సబబు. అందుకే మనం వారి సరికొత్త ఆలోచనలను వారి స్థానిక భాషలోనే చర్చించాలి. వారికి తగిన సమాచార సామగ్రిని అందించాలి. సరికొత్త ఆలోచనలన్ని మనముందు వెల్లడిస్తున్న వ్యక్తికి ఆ ఆలోచనలతో మనమేమి చేస్తామో తెలియాలి. వారి పరిజ్ఞానాన్ని విస్తారం చేయడం ద్వారా ఎంతోకొంత ఆదాయాన్ని వీరికి సమకూర్చాలి. ఇది వీలైనంత పారదర్శకంగా ఉండాలి.

ప్రజల మధ్య అభ్యాసానికి 'పల్లెసృజన' ఒక ప్రయోగం వంటిది. మనం ఇంగ్లీషులో రాస్తాము. అది ప్రపంచమంతటికి వ్యాపిస్తుంది. కానీ, స్థానికులను పరాయి వారిని చేస్తుంది. మనం ఎక్కడి నుండి నేర్చుకున్నామో అక్కడికి చేరుకోలేము. ఒకవైపు మనం ఎదుగుతూ ఉంటాం. కెరీర్‌లో ఒక్కొక్క శిఖరాన్ని అధిరోహిస్తాము. వృత్తి సంబంధమైన పురస్కారాల్ని అందుకుంటాము. ఇదే సమయంలో మన ఆలోచనలలో భాగస్వామి అయినా స్థానికుడు బాధలు పడతాడు. మౌనంగా వేదనకు లోనవుతాడు. విజ్ఞాన సేకరణ, దాన్ని పత్రరూపంలో సిద్ధం చేయడం (డాక్యుమెంటేషన్), ఆ విజ్ఞానాన్ని నలుదిశలా వ్యాపింపజేయడం, వాటికి సిద్ధాంతాల్ని, రూపాన్ని కల్పించడం, సంస్థలకు పరిచయం చేయడం, నైతిక సూత్రాల పాటింపు, హనీబీ ఆలోచనల్లో ప్రధానమైనవి. ఈ విజ్ఞానాన్ని విస్తారంగా ప్రచారం చేయడానికి 'పల్లెసృజన' తెలుగునాట కృషి చేస్తున్నది. హనీబీ యంత్రాంగానికి చేయూత నందించాలి. అనుకున్నట్టయితే మీరూ మా పత్రిక వార్షిక చందా లేదా జీవత కాలపు చందాలతో ముందుకు రండి. మీ సృజనలను, ఆలోచనలను మాకు ప్రచురణకై పంపండి.

## చందా వివరాలు

| | | వ్యక్తిగతం | సంస్థ / లైబ్రరీ |
|---|---|---|---|
| సంవత్సరానికి | : | **100/-** | **1,000/-** |
| రెండు సంవత్సరాలకు (ఒక పాత సంచిక ఉచితం) | : | **175/-** | **1,750/-** |
| మూడు సంవత్సరాలకు (రెండు పాత సంచికలు ఉచితం) | : | **250/-** | **2,500/-** |
| ఐదు సంవత్సరాలకు (నాలుగు పాత సంచికలు ఉచితం) | : | **400/-** | **4,000/-** |

**మీ చందాలను డి.డి. / మనీఆర్డర్ / చెక్కులను**
**శ్రీమతి పి. అరుణ గణేశం పేరున హైదరాబాద్‌లో చెల్లునట్లు**
**ఈ క్రింది చిరునామాకు పంపించండి.**


అసోసియేట్ ఎడిటర్, పల్లె సృజన
102 , వాయుపురి, సైనికపురి పోస్టు,
సికింద్రాబాద్ – 500 094.
ఫోన్ : 98660 01678
e-mail : honeybeeap@gmail.com

నాలుగో వసంతంలోకి అడుగిడటానికి ముస్తాబు కాబోతున్న

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక
రూ. 15/-లు
మాత్రమే





పల్లెసృజన పత్రిక రెగ్యులర్ చందా దారులు కండి
పల్లె జ్ఞానశోధనకు సహకరించండి!

## పల్లెసృజన చందా వివరాలు

| | వ్యక్తిగతం | సంస్థ / లైబ్రరీ |
|---|---|---|
| సంవత్సరానికి | : 100/- | 1,000/- |
| రెండు సంవత్సరాలకు (ఒక పాత సంచిక ఉచితం): | 175/- | 1,750/- |
| మూడు సంవత్సరాలకు(2 పాత సంచికలు ఉచితం): | 250/- | 2,500/- |
| ఐదు సంవత్సరాలకు(4 పాత సంచికలు ఉచితం) | : 400/- | 4,000/- |

మీ చందాలను డి.డి. / మనీఆర్డర్ / చెక్కులను
శ్రీమతి పి. అరుణ గణేశం పేరున హైదరాబాద్‌లో చెల్లునట్లు
ఈ క్రింది చిరునామాకు పంపించండి.

అసోసియేట్ ఎడిటర్, పల్లె సృజన
102, వాయుపురి, సైనికపురి పోస్టు,
సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 98660 01678
e-mail : honeybeeap@gmail.com

Narendra Graphics, Hyd. Ph. : 93913 75655